




# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 20-06-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 268 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## నిరుద్యోగ భృతి విధివిధానాలపై చర్చ

- పరిశ్రమలకు భూకేటాయింపులు, అగ్రిగోల్డ్ అంశంపై చర్చ
- కొనసాగుతున్న ఏపీ కేబినెట్ సమావేశం



అమరావతి: ఏపీ మంత్రివర్గం సచివాలయంలో సమావేశమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ కొనసాగుతోంది. ఈ సమావేశంలో ప్రధానంగా నిరుద్యోగ భృతి విధివిధానాల ఖరారుపై చర్చించనున్నారు. అలాగే పరిశ్రమలకు భూకేటాయింపులు, తరువాయి 2లో..

## బహిరంగంగా శిక్షిస్తేనే భయపడతారు

**జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్**

**విషయం తెలియగానే హృదయం ద్రవించిపోయింది**



హైదరాబాద్: ఆడపిల్లల జోలికి వస్తే కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. నిర్మల్ జిల్లా సోన్‌లో పదేళ్ల బాలిక అత్యాచారం, హత్య ఘటనపై తరువాయి 2లో..

# న్యాయం చేయమంటే సీఎం బెదిరింపులా..

- బాబుది నియంత స్వభావం
- నాగరికంగా ఉండాలంటే నాయీబ్రాహ్మణుల సేవలు పొందాలి
- చంద్రబాబుగారికి బీసీలపట్ల కపటప్రేమ రుజువైంది
- వైకాపా నేత వైఎస్ జగన్



పి.గన్నవరంః కష్టాలు చెప్పుకోవడానికి వచ్చిన నాయీ బ్రాహ్మణులపై సీఎం చంద్రబాబు బెదిరింపులకు దిగడం దుర్మార్గమన్నారు వైఎస్ జగన్. ట్విట్టర్ ద్వారా స్పందించిన ప్రతిపక్ష నేత.. సీఎం తీరుపై మండిపడ్డారు. మనం నాగరికంగా ఉండాలంటే నాయీబ్రాహ్మణుల సేవలు పొందాలి. అలాంటి నాయీబ్రహ్మణుల పట్ల సచివాలయం సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవర్తించిన తీరును చూసి విస్తుపోయా. తమ గోడు చెప్పుకోవడానికి వచ్చిన వారిని బెదిరించడం దారుణం. పైగా తలనీలాలు తీసినందుకు రూ.25లు చొప్పున ఇస్తానంటూ.. ఏదో దేవుడిచ్చిన వరమైనట్లుగా చంద్రబాబుగారి హావభావాలు ఆయనలోని అహంకార, నియంత స్వభావాలను కళ్లకు కట్టినట్లు చూపించాయి. చంద్రబాబుగారికి బీసీలపట్ల కపటప్రేమ మరోసారి వెల్లడైంది అని వ్యాఖ్యానించారు.

ప్రతిరోజూ ఆలయంలో ఒక నాయీ బ్రాహ్మణుడు మహా అంటే 10-15 మందికి తలనీలాలు తీస్తారు. భక్తులు రద్దీగా ఉంటేనే అదికూడా సాధ్యం. భక్తులు రాకపోతే గుడిని నమ్ముకున్న తమ బతుకుల పరిస్థితి ఏంటని అడుగుతున్న నాయీ బ్రాహ్మణుల న్యాయమైన డిమాండ్లపై ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాల్సిన తీరు ఇదేనా? కనీస వేతనాలు ఇవ్వనంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రే చెప్పటం చట్టానికి వ్యతిరేకం. దేవుడి దయతో మన ప్రభుత్వం రాగానే మీ అందరి ముఖంలో చిరునవ్వులు కనిపించేలా కనీస వేతనం ఇస్తాం. ఎప్పటికప్పుడు మీ సమస్యలు పరిష్కారం అయ్యేలా తిరుమల తిరుపతి దేవస్థానం సహా ప్రతిదేవాలయ బోర్డులోనూ ఒక నాయీ బ్రహ్మణుడిని సభ్యుడిగా నియమిస్తాం అని హామీ ఇచ్చారు వైసీపీ అధినేత.

నాలుగు రోజులు పాటూ నాయీ బ్రాహ్మణులు సమ్మె చేశారు. నెలకు రూ.15 వేల వేతనంతో పాటూ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరి సమ్మెతో భక్తులు ఇబ్బందులు పడటంతో.. డిప్యూటీ సీఎం చర్చలకు ఆహ్వానించారు. టిక్కెట్‌పై రూ.20 ఇస్తామని.. మిగిలిన అంశాలను సీఎం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పినా.. జేఏసీ నేతలు ఒప్పుకోలేదు. సెక్రటేరియెట్ దగ్గర భారీగా గుమ్మి గూడారు. చర్చలకు పిలిచి అవమానించారని.. సమ్మెను మరింత తధృతం చేస్తామన్నారు.

నాయీ బ్రాహ్మణులు అక్కడున్న సమయంలోనే సీఎం కాన్వాయ్ వచ్చింది. జనాల గుంపును చూసి చంద్రబాబు.. కారు ఆపి దిగి వచ్చారు. భద్రతా సిబ్బంది వారిని అడ్డుకోబోగా సీఎం ఆపారుజ టిక్కెట్‌కు రూ.25 ఇస్తామని చెప్పారు. అయినా వాళ్లు వెనక్కు తగ్గలేదు. గౌరవ వేతనం, పెన్షన్ ఇవ్వాలని అడిగారు. చంద్రబాబు మాత్రం ససేమీరా అన్నారు. కొందరు నాయీ బ్రాహ్మణులు వాగ్వాదానికి దిగగా.. వారిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం ఉంటే వెదుక్కుంటూ వస్తా.. ఏం చేస్తారో చేసుకోండి అంటూ వెళ్లిపోయారు. ఇవాళ చంద్రబాబు వ్యాఖ్యలపై జగన్ స్పందించారు.

**బామ్మకు చెప్పులు తొడిగిన వైఎస్ జగన్!**

పాదయాత్ర జనసందోహంలో తనను చూడటానికి వచ్చిన ఒక వృద్ధురాలికి స్వయంగా చెప్పులు తొడిగారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి. జనంమధ్యన నిలబడటానికి కూడా తరువాయి 2లో..

## ఏపీ నిరుద్యోగులకు చీకటి రోజు



## 21వేల మంది నిరుద్యోగులను మోసం చేసింది

**బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు**

అమరావతి : రాష్ట్ర సాక్షర భారత్ పథకంలో పని చేస్తున్న 21వేల మంది ఉద్యోగులను ఒక లెటర్ ద్వారా తొలగించి వారిని రోడ్డున పడేసారని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాబు వస్తే జాబ్ అన్నారు.. 21వేల మందిని నిరుద్యోగులు చేశారని మండిపడ్డారు. ఉద్యోగాల నుంచి తొలగించిన వారికి భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాక వారిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని విద్యాశాఖ మంత్రికి 10సార్లు ఫోన్ చేశామని తెలిపారు. అయిన ఈ విషయంపై వారు స్పందించలేదన్నారు. 21వేల ఉద్యోగుల ఉసురు తగులుతుందని తరువాయి 2లో..



## ఏపీ ప్రభుత్వ సలహాదారు పరకాల రాజీనామా

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం రాజీనామా లేఖను ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిన ప్రభాకర్.. తక్షణం తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. గత కొన్ని రోజులుగా ప్రతిపక్ష నాయకుడు సహా ఆ పార్టీ నేతలు చేస్తోన్న ఆరోపణలతో మనస్తాపానికి గురై పరకాల ప్రభాకర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

నాలుగేళ్లుగా ప్రభుత్వానికి సలహాదారుడిగా వ్యవహరిస్తున్న ప్రభాకర్ నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో కీలక భూమిక పోషించారు.

పరకాల ప్రభాకర్ సతీమణి నిర్మలా సీతారామన్ భారత రక్షణశాఖ మంత్రిగా ఉన్నారు.

## మిమిక్రీ లెజెండ్ వేణు మాధవ్ కన్నుమూత

**ఐ.రా.స.లో ప్రదర్శన ఇచ్చిన ఏకైక తెలుగు కళాకారుడు**



ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ (85) మంగళవారం కన్నుమూశారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వరంగల్‌లోని స్వగృహంలో మంగళవారం తుదిశ్వాస విడిచారు వార్త 8వ పేజీలో..











## సీఎం పర్యటన విజయవంతానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయండి

- అధికారులకు ఆదేశాలు జారీ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రవీణ్ కుమార్



వార్త 2వ పేజీలో..

# 21న నాల్గవ అంతర్జాతీయ యోగా డే

## - అందరూ ఆహ్వానితులే - జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు



విజయనగరం : నాల్గవ అంతర్జాతీయ యోగా డే సందర్భంగా ఈనెల 21న ఉదయం 6 గంటలకు స్థానిక జిల్లా గ్రంధాలయ సంస్థ మేడపైన చాసో హాల్‌లో యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అందరూ ఆహ్వానితులేనని జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగాడే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. మంగళవారం జిల్లా రెవిన్యూ అధికారి ఛాంబర్‌లో యోగాడే ఏర్పాట్లుపై ఆయుష్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, సంయుక్త కలెక్టర్, సంయుక్త కలెక్టర్-2, జిల్లా రెవిన్యూ అధికారి, జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. యోగాపై ఆసక్తి వున్న అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సాధ్యమైనంత వరకు యోగా చేయుటకుఅనుకూలమైనతెల్లటి దుస్తులైన కుర్తా, పైజామా దరించిహాజరు కావాలన్నారు. యోగాలో అనుభవజ్ఞులైన వారిచే యోగాసనాలు వేయించడం, నేర్పించడం జరుగుతుందని, యోగా వలన కలిగే ఉపయోగాలు గురించి వివరించడం జరుగుతుందన్నారు.

# 22న జిల్లా స్థాయి పరుగు పోటీలు



విజయనగరం : ఎలయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 105 ఆధ్వర్యంలో ఈ నెల22వ తేదీన జిల్లాస్థాయి పరుగు పోటీలను నిర్వహిస్తున్నామని క్లబ్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్ అన్నారు. సోమవారం ఉదయం లార్వెన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 22వ తేదీ ఉదయం 9 గంటలకు లార్వెన్స్ పాఠశాలలో బాల, బాలికలకు వేర్వేరుగా 100 మీటర్ల పరుగుపందెం ఉంటుందని, 7, 8వ తరగతి విద్యార్ధులు జూనియర్ విభాగంలోను, 9, 10వ తరగతి విద్యార్ధులు సీనియర్ విభాగంలో పాల్గొనవచ్చునని పూర్తి వివరాలకోసం 9490462262 నెంబర్‌ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తొలుత పోటీల ఆహ్వానప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కేబినెట్ కార్యదర్శి పిన్నింటి సూర్యనారాయణ, జోన్ ఛైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, మహిళా ఛైర్‌పర్సన్ కె.విమలారాణి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# సీఎం పర్యటన విజయవంతానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయండి

విశాఖపట్నంః ఈ నెల 21వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనను పురస్కరించుకుని సీఎం పాల్గొనున్న కార్యక్రమాల వేదికలను జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఇతర పోలీసు యంత్రాంగం దగ్గరుండి మరీ పరిశీలించారు. మంగళవారం తొలుత ఏయూ గ్రౌండ్స్‌ను పరిశీలించారు. ప్రోటోకాల్ ప్రకారం సీట్ల ఏర్పాటు తదితర విషయాలపై అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. తొక్కిసలాట జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం రుషికొండ సమీపంలో ఉన్న సాయిప్రియా రిసార్ట్స్ పరిశీలించి అక్కడ సీఎం హెల్త్ ఫెస్టివల్ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ వాహనాలు ఎక్కడ ఆపాలి వాటి పార్కింగ్ విషయాలు అధికారులకు వివరాలను తెలపమని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ముఖ్య ప్రతినిధులతో కలెక్టర్ చర్చించే ఏర్పాట్లకై ప్రత్యేక గ్యాలరీ ఏర్పాట్లు చూడాలన్నారు. కార్యక్రమాన్ని చూచేందుకు ఇబ్బంది కలగకుండా పెద్ద పెద్ద స్క్రీన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇక్కడే వుడా రో హౌసింగ్ శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. మధ్యాహ్న భోజన విరామ సమయానికి ఆగనున్న పోర్ట్ గెస్ట్ హౌస్‌ను పరిశీలించి దాని పరిసర ప్రాంతాలలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఆయూష్ కమిషనర్ శోభ, రాష్ట్ర ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ వాసుదేవరావు, వుడా కార్యదర్శి శ్రీనివాస్, డీసీపీ ఫకీరప్ప, ఆర్డీవో తేజ్ భరత్ తదితర శాఖల అధికారులు, ఇతరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ భృతి విధివిధానాలపై చర్చ

అగ్రిగోల్డ్ అంశంపై కూడా చర్చ జరపనున్నారు. విభజన హక్కుల సాధన కోసం ఎలాంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలన్న అంశంపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఢిల్లీ పర్యటన వివరాలను చంద్రబాబు మంత్రుల దృష్టికి తీసుకురానున్నారు. నీతిఆయోగ్ సమావేశంలో ప్రస్తావించిన సంగతులను ముఖ్యమంత్రి వివరించనున్నారు. ఇప్పటికే పరకాల ప్రభాకర్ రాజీనామాను తిరస్కరిస్తున్నట్లు సీఎంవో వర్గాలు వెల్లడించాయి.

## న్యాయం చేయమంటే సీఎం బెదిరింపులా..

సరిగా పట్టులేని ఆ బామ్మ చెప్పులు జారిపోయాయి. వారిమధ్యన ఆమె వాటిని తొడుక్కోలేకపోయింది. జగన్ దగ్గరే ఉన్న సమయంలో ఇలా జరిగింది. పరిస్థితిని గమనించిన ఆయన తనే వంగి ఆమెకు చెప్పులు తొడిగారు. వృద్ధురాలు వద్దని వారిస్తున్నా... జగన్ తన చేతులో ఆమె పాదాలకు చెప్పులు తొడిగారు. అనంతరం ఆమెతో తనదైన శైలిలో పలకరించి ముందుకు సాగారు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. ప్రజాసంకల్పయాత్రలోని ఈ సన్నివేశం ఆకట్టుకుంది. ఆ సమయంలో కెమెరాలు క్లిక్‌మనడంతో ఆ ఫొటో వెబ్‌లోకి అప్‌లోడ్ అయ్యి వైరల్‌గా మారింది. ప్రస్తుతం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర తూర్పుగోదావరి జిల్లాలో సాగుతోంది. జిల్లాలో ని పి.గన్నవరం నియోజకవర్గంలో జగన్ ప్రజాసంకల్పయాత్ర సాగుతోంది. ఇప్పటి వరకూ ఆయన 2,379 కిలోమీటర్ల దూరాన్ని నడిచారు.

## బహిరంగంగా శిక్షిస్తేనే భయపడతారు

ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. అన్నెంపున్నెం ఎరుగని బాలికలు, యువతులపై అత్యాచారానికి ఒడిగట్టే మానవ మృగాలని బహిరంగంగా శిక్షించాలి. నిర్మల్ జిల్లా సోన్‌లో ఐదో తరగతి చదువుతున్న పదేళ్ల బాలికపై 30 ఏళ్ల వ్యక్తి అత్యాచారం చేసి, హత్య చేశాడనే విషయం తెలియగానే హృదయం ద్రవించిపోయింది. కశ్మీర్‌లోని కథువా, గుంటూరు జిల్లాలోని దాచేపల్లి ప్రాంతాలలో బాలికలపై చోటుచేసుకున్న అత్యాచార ఘటనల చేదు జ్ఞాపకాలు సమాజంలో ఇంకా పచ్చిగానే ఉన్నాయి.

ఇప్పుడు సోన్‌లో చోటుచేసుకున్న దురాగతం గురించి వినడం బాధాకరం. పోక్సో చట్టం అమలులో లోపాలు లేకుండా చూడటంతోపాటు, ఆడపిల్లల జోలికి వస్తే కఠినంగా శిక్షించేలా చట్టంలో మార్పులు చేయాలి. బహిరంగంగా శిక్షిస్తేనే పశువాంఛ కలిగిన వారు భయపడతారు. దోషిని కఠినంగా శిక్షించి బాధిత బాలిక కుటుంబానికి తగిన న్యాయం చేయాలి అని పవన్ కోరారు.

## ఏపీ నిరుద్యోగులకు చీకటి రోజు

విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 24,470 మంది నిరుద్యోగులను మోసం చేసిందని బీజేపీ నేత విష్ణు వర్ధన్ రెడ్డి మండిపడ్డారు. అంతేకాక ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగులకు చీకటి రోజు అని ఆయన పేర్కొన్నారు. సాక్షర భారత్‌లో పని చేస్తున్న 21వేల మంది ఉద్యోగలను తొలగించారు.. 8ఏళ్ళుగా పనిచేస్తున్న వారిని ఉన్న ఫలంగా తీసేస్తే వారి పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. వయోపరిమితి దాటిన వారికి అక్షరాలు నేర్పడం వారి పని.. కానీ వారితో ప్రభుత్వానికి సంబంధించిన పనులు చేయించుకున్నారని విమర్శించారు.

600 మోమో కాపీని వారికి ఇవ్వకుండానే ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయం. ఇది కూడా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన పని అని చెప్పి విమర్శలు చేస్తారేమో. 21వేల మందిని తొలగించడం ప్రభుత్వంకు తెలుసో లేదో అర్థం కావడం లేదు. రూ. 4కోట్ల రూపాయలు 21 వేలమంది ఉద్యోగులకు ప్రభుత్వం ఇవ్వలేదా? మానవతా దృక్పధంతో ఆలోచించి ప్రభుత్వం తక్షణమే స్పందించి మోమోని ఉపసంహరించుకోవాలని బీజేపీ నేత విష్ణు వర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# మాట తప్పిన బిజెపికి భవిష్యత్తులో వేటు తప్పదు

## ఆడారి కిషోర్ కుమార్



విశాఖపట్నం : విశాఖపట్నం విశాఖ రైల్వే జోన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడుతుందని ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు మోసం చేస్తుందని విద్యార్ధి సంఘం రాష్ట్ర అద్యక్షు ఆడారి కిశోర్ కుమార్ ఆరోపించారు. మంగళవారం నగరంలోని పెదవాల్తేర్ లో ఆయన కార్యాయంలో నిర్వహించిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ వస్తుందన్న ఆశాభావంతోనే కేంద్ర మంత్రి సురేష్ ప్రభు కు ఆంధ్ర ప్రదేశ్ క్యాడర్ నుంచి రాజ్యసభ సీటు కేటాయించడం కూడా జరిగిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన బిల్లు లో షెల్ ఎగ్జామిన్ అనే విషయం ఉందని, దాన్ని సాకుగా చూపుతూ మాట దాటేసారని, ఆడారి కిశోర్ కుమార్ అన్నారు దేశంలోనే అత్యధిక ఆదాయం ఇచ్చే రైల్వే డివిజన్లలో విశాఖపట్నం నాల్గవ స్ధానంలో ఉందని, ఏడాదికి 7200 కోట్ల రూపాయు ఆదాయం లభిస్తుందన్నారు. అయినప్పటికీ విశాఖ రేల్వే స్టేషన్ గతి అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఇక ఉత్తరాంధ్రా లో మిగిలిన స్టేషన్ల పరిస్ధితి అధోగతేనన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే కేవం ఆరు నెలలు లోగా విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఇస్తామని హామీ ఇచ్చి, ఎన్నికల్లో ఓట్లు సంపాదించిన నాయకులు నేడు ఆ మాటలకు విలువ లేకుండా చేశారని ఆయన ఎద్దేవా చేశారు దీనికి నిరసనగా రానున్న కాంలో రాష్ట్రంలోని అన్ని విద్యార్ధి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, సామాజిక సంఘాలు, మహిళా సంఘాలు, జేఏసీలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు కిషోర్ తెలిపారు రానున్న కాలంలో విషయములో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన పేర్కొన్నారు విలేకరు సమావేశంలో సురక్ష ఆసుపత్రి ఎండీ, చలపతి,చంద్రరావు డాక్టర్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసా పత్రాలు



విజయనగరం : జిల్లా ఎస్. కోట పోలీసు స్టేషను కేసులో ఒక మైనరు బాలికను ప్రేమ పేరుతో మోసగించి, పెండ్లి చేసుకోవడానికి నిరాకరించిన కేసులో కోర్టు నిందితుడికి పదేళ్ళు శిక్ష విధించుటలో సమర్ధవంతంగా పనిచేసి, సఫలీకృతులు అయిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ జి. పాలరాజు తన కార్యాలయంలో సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. కేసు వివరాల్లోకి వెళ్లితే... డెంకాడ మండలం అయినాడ గ్రామానికి చెందిన గొడ్డు అనిల్ కుమార్ ఎస్. కోటలో ఉంటున్న తన సోదరి ఇంటి వద్ద ఉంటూ, తన సోదరి ఇంటికి ట్యూషనుకు వచ్చే బాధితురాలుని అనిల్ కుమార్‌తో లోబర్చుకున్నాడు. బాధితురాలు మైనరు బాలిక అయినప్పటికీ ఆమెను ప్రేమ పేరుతో మోసగించి, శారీరకంగా అనుభవించి, తదుపరి పెండ్లికి నిరాకరించడంతో బాధితురాలు 2016లో ఎస్. కోట పోలీసులును ఆశ్రయించింది. ఎస్. కోట పోలీసులు నిందితుడు గొడ్డు అనిల్ కుమార్‌పై అప్పటి ఎస్ఐ కె. రవికుమార్ కేసు నమోదు చేయగా, అప్పడి విజయనగరం డిఎస్పీ కె. కృష్ణ ప్రశాంతి దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసినారు. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. పరశురాం పోలీసులు సమర్పించిన సాక్ష్యాలను ప్రాసిక్యూషన్‌లో సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో జిల్లా అదనపు న్యాయమూర్తి వర ప్రసాద్ నిందితుడు గొడ్డు అనిల్ కుమార్‌కు పది సంవత్సరాలకఠిన కారాగార శిక్షతో పాటు 11 వేల రూపాయిల జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడు శిక్షింపబడుటలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్. కోట ఎస్ఐ ఎస్. అమ్మినాయుడు, కోర్టు లైజన్ ఆఫీసరు కృష్ణ కుమారి, ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేయుచున్న ఎఎస్ఐ టి. శ్రీహరి, ఎస్. కోట కోర్టు కానిస్టేబులు సిహెచ్. లోకనాధంలను జిల్లా ఎస్పీ తన కార్యాలయానికి పిలిపించి, వారికి ప్రశంసా పత్రాలను, పోత్సాహక నగదు బహుమతులను జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐలు వై.వి. శేషు, జి. రామకృష్ణలు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు

## జిల్లా ఎస్పీ జి. పాలరాజు



విజయనగరం : జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. పాలరాజు సోమవారం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వ్యధ విభాగానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 15 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి, ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు, వాటిపై చర్యలు చేపట్టేందుకు సదరు ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు పంపారు. ఈ ఫిర్యాదుపై స్పందిచిన ఎస్పీ పూర్తి స్థాయి విచారణ చేపట్టి, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా ఎస్. కోట సిఐను ఆదేశించారు. విజయనగరం పట్టణానికి చెందిన అర్జి అప్పలరాజు విజన్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్ధకు ఎం.డి.గా పనిచేయుచున్న పోలవరపు వసంతరావుకు రూ. 5 లక్షలు డిపాజిట్‌గా చెల్లించినట్లు, తదుపరి సదరు సంస్ధ యజమాని పరారీకాగా, తాను ఇచ్చిన ఫిర్యాదుపై విజయనగరం 1వ పట్టణ పోలీసులు 4 సంవత్సరాల క్రితం కేసు నమోదు చేసినప్పటికి, నిందితుడు ఇంత వరకు దొరకలేదని, న్యాయం చేయాల్సిందిగా ఎస్పీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ నిందితుడ్ని పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించాలని విజయనగరం 1వ పట్టణ సిఐను ఆదేశించారు. డెంకాడ మండలం అక్కివరంకు చెందిన స్వామీ సుదర్శనానంద సరస్వతి ఫిర్యాదు చేస్తూ అక్కివరం గ్రామంలోగల సచ్చిదానంద ఆశ్రమ ట్రస్టుకు చెందిన భూములను కొంత మంది తప్పుడు పత్రాలతో ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ భోగాపురం సిఐను పూర్తి స్థాయి విచారణ చేపట్టాల్సిందిగాను, తనకు వాస్తవాలను నివేదించాల్సిందిగా ఆదేశించారు. డెంకాడ మండలం, అక్కివరం గ్రామానికి చెందిన సన్యాసమ్మ ఫిర్యాదు చేస్తూ గతంలో తన కుమారులతో కలసి భూములు కొనుగోలు విషయమై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సాక్షిగా వెళ్ళి సంతకాలు చేసినట్లు, ఇప్పుడు కె. త్రిమూర్తులు అనే ఆసామీ మరికొంత మందితో కలసి తన ఇంటికి వచ్చి తనను అసభ్య పదజాలంతో ధూషిస్తున్నట్లు, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ పూర్తి స్థాయి విచారణ చేపట్టాల్సిందిగా, ఇరువురి డాక్యుమెంట్లును పరిశీలించి, వాస్తవాలను నివేదించాల్సిందిగా ఆదేశించారు. ఎల్. కోట మండలం కొనమశివానిపాలెం గ్రామ సంచాయితీ పరిధిలో నిర్మించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సిరిసపల్లి రాంబాబు, కొంత మంది వ్యక్తులు ధ్వంసం చేసారని వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ పంచాయితీ సెక్రటరీ బుగత లక్ష్మణ రావు ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని ఎస్. కోట సిఐను ఆదేశించారు. ఫిర్యాదుల విభాగంకు వచ్చే ఫిర్యాదులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి, వాటిపై తక్షణమే స్పందించాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తనకు వెంటనే నివేదించాలని జిల్లా ఎస్పీ పాలరాజు పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐలు వై.వి.శేషు, రామకృష్ణ, ఎస్ఐ డి.రవికుమార్‌లు పాల్గొన్నారు.

# కన్నడభవన్‌లో బుద్ధ విగ్రహం ఆవిష్కరణ



కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి జయమాల తొలిసారిగా ఇక్కడ కన్నడ భవన్‌కు వచ్చారు. కన్నడభవన్ ఉద్యాన వనంలో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహం ఏర్పాటుపై ఆమె అధికారు లను ప్రశంసించారు. అనం తరం ఆమె అక్కడ అధికారు లతో సమావేశమయ్యారు.

# నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం



భీమునిపట్నం : మంత్రివర్యులు శ్రీ గంటా శ్రీనివాసరావు భీమిలి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం గంటా నివాసంలో నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో హౌసింగ్, అభివృద్ధి పనులు, రోడ్లు, భవనాలు ఇతర ముఖ్య విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ విజయ్ బాబు, ఏఎంసీ చె%ర్మన్ కోరాడ నాగభూషణరావు, గిడ్డంగుల డైరెక్టర్ మణి శంకర నాయుడు, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు గాడు.వెంకటప్పడు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కురిమిన.లీలావతి, కోరాడ.రాజబాబు, బమ్మిడి ఉమా, భీమిలి, తగరపువలస డివిజన్ అధ్యక్షులు గంటా.నూకరాజు , కొప్పల.రమేష్, సమన్వయ కమిటీ సభ్యులు పార్టీ నాయుకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంధ విద్యార్థులకు వరం

## ఈ ఏడాది ఉచితంగా 9, 10వ తరగతి పాఠ్య పుస్తకాలు

బ్రహ్మపుర : రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న అంధ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేం దుకు వివిధ పాఠ్యాంశాల పాఠ్య పుస్తకాలు సిద్ధమయ్యాయి. రాష్ట్రంలోని ఏకైక బ్రెయిలీ లిపి ముద్రణాలయం రెడ్‌క్రాస్ కంప్యూటరైజ్డ్ బ్రెయిలీ ప్రెస్ బ్రహ్మపురలో ఉంది. ఈ ముద్రణా లయంలోని రెండు హై స్పీడు కంప్యూటరైజ్డ్ ఎంబోజర్ యంత్రాలు, మాన్యువల్ యంత్రాల ద్వారా వివిధ తరగతు లకు చెందిన సుమారు యాభై పాఠ్యాంశాలతో పుస్తకాల ముద్రణ పూర్తయింది. ఈనెల 22వ తేదీ నుంచి రాష్ట్రం లోని వివిధ ప్రాంతాలకు చెందిన అంధ పాఠశాల ల నిర్వాహకులు బ్రహ్మపుర వచ్చి తమకు అవసరమయ్యే తరగతుల పాఠ్య పుస్తకాలు తీసుకువెళతారని ముద్రణాలయం మేనేజరు ప్రకాష్ నారాయణ చెప్పారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

VIZAG ...ahead

'e' Procurement Short Tender Notice No.17/2018-19/EE-IVB/DB, Dt:19-06-2018

స్వచ్ఛ ఆంధ్ర | స్వచ్ఛ విశాఖ

| | | | |
|---|---|---|---|
| 01. Number of Works | : | 1 No | |
| 02. Value of Works (ECV) | : | Rs.3.10 Lakhs | |
| 03. Down Loading Starting Date | : | 19-06-2018 @ | 5.00 PM |
| 04. Down Loading Ending Date | : | 22-06-2018 @ | 5.00 PM |
| 05. Last date of Bid submission | : | 22-06-2018 @ | 5.30 PM |
| 06. Date of Opening of Tender | : | 22-06-2018 @ | 6.00 PM |

**Note:** For any other details required in respect of above tender notice, please contact **EE-IV(B)** before applying for tender schedules and visit vsp @ **www.apeprocurement.gov.in.**

EE-IVB

ఇంటింట మరుగుదొడ్డి - బహిరంగ మల విసర్జనకు స్వస్తి

# డ్రైయిన్లలో పూడిక తీయించండి

## ప్రజారోగ్యానికి భంగం కలిగించొద్దు .. జివిఎంసి కమిషనర్ హరినారాయణన్




విశాఖపట్నం: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్రపర్యటనలో భాగంగా జోన్-1 లో 5, 6 వార్డుల లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రో-హౌసింగ్, సాయి ప్రియ రిసార్ట్స్, ఋషికొండ ప్రాంతాలలో పర్యటించి పలు సూచనలు చేశారు. అన్ని రహదారులు, రోడ్ మార్జిన్లను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. రోడ్లపై చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలని కోరారు. డ్రైయిన్లలో పూడిక తీసి సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రజారోగ్యానికి భంగం కలిగించే దుకాణాలు, బార్‌లపై జరిమానా విధించాలని ఆదేశించారు. ఋషికొండ కూడలిలోని కీర్తి వైన్స్‌కు ఐదు వేల రూపాయలు జరిమానా విధించాలని పేర్కొన్నారు.

పర్యటనలో జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్, ఏసిపి వెంకటేశ్వరరావు, యస్.ఇ వేణుగోపాల్, ఇ.ఇ చక్రవర్తి, డి.ఇ శ్రీధర్, ఏ.ఇ భరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మీ ఆరోగ్యం - మీ చేతుల్లోనే

- డెంగూ, మలేరియా నివారణ
- నీరు నిల్వ లేకుండా చర్యలు
- మూతలు బిగించండి
- వెంటిలేటర్లకు దోమతెరలు కట్టండి
- గెడ్డలు, కాలువలలో చెత్తా చెదారం వేయకండి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం: ఇంటి లోపల పరిసరాలలో దోమల వ్యాప్తి అరికట్టడం ద్వారా డెంగూ, మలేరియా వ్యాధులు సోకకుండా నివారించు కోవచ్చునని జివియంసి కమిషనర్ హరి నారాయణన్ పేర్కొన్నారు.

జ్వరం సోకకుండా దోమ తెరలు వాడాలి. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తవహించండి. నీటి తొట్టెలు, బిందెలను వారానికి ఒకసారి ఖాళీ చేసి డ్రై డే పాటించడం ద్వారా దోమల వ్యాప్తి అరికట్టవచ్చునని అభిల షించారు. ఒక వేళ జ్వరం వస్తే వెంటనే రక్తపరీక్ష చేయించి మలేరియా గా నిర్ధారణ అయితే పూర్తి కోర్సు వాడి నయమయ్యేటట్లు చూసుకోవాలని కోరారు.

అదే డెంగూ అయితే ఆసుపత్రిలో చూపించు కోవాలని పేర్కొన్నారు. స్వంత చికిత్స పనికిరాదని హితవు పలికారు.

ప్రజలను చైతన్యవంతం, అప్రమత్తం చేయడానికి మీ ఇంటికి వచ్చే ప్రజా రోగ్య, మలేరియా సిబ్బంది, సాధికార మిత్రులకు సహకరించి అనారోగ్యం రాకుండా చూసుకోండి.

కేవలం కొంచెం శ్రద్ధతో ఇంటి, పరిసరాల పరిశు భ్రత పాటించడం ద్వారా దోమల వలన వచ్చే జ్వరాలు నుండి కాపాడుకోవచ్చునని పేర్కొన్నారు.

మీ ఆరోగ్యం - మీ చేతుల్లోనేనని - ఆరోగ్యకరమైన వాతావరణంలో ఆరోగ్యవంతమైన జీవితం గడపడానికి అందరు భాగస్వాములు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

# ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు



ఆంధ్ర విశ్వ విద్యాలయంః ఏ.యూ.లో హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్ష్యుడు రాహుల్ గాంధి జన్మదిన వేడుక జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోటి జాన్ కేక్ కట్ చేసి విద్యార్ధి నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మాటిచ్చిన కాంగ్రెస్ పార్టీని తిరిగి ఆదరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి రిసెర్చ్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ డా. విజయ చంద్ర , అంధ్ర విశ్వా విద్యాలయం జాక్ కన్వీనర్ అరేటి మహేష్, కాంగ్రెస్ నాయకులు రంగనాద్ రాయ్, విశాఖ తూర్పు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్ష్యుడు కొయ్య రామ కృష్ణ, రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ మరియు పలువురు విద్యార్ధినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## రాహుల్ రాకతో

# కాంగ్రెస్ మరింత పటిష్ఠం



విశాఖపట్నం: ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు. ఏఐసీసీ అధ్యక్షులుగా ఎన్నికైన తరువాత మొదటిసారిగా జరుపుకుంటున్న జన్మదినోత్సవాన్ని కాంగ్రెస్ శ్రేణులు పండుగలా జరుపుకున్నారు. మంగళవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినుపించుకున్నారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు, కృపారాణి మాట్లాడుతూ త్యాగాల కుటుంబంలో జన్మించిన రాహుల్ గాంధీ ఏఐసీసీ అధ్యక్షులుగా పగ్గాలు చేపట్టిన తరువాత కర్నాటకలో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించగలిగామని, అదే ఉత్సాహంతో కాంగ్రెస్ కార్యకర్తలు పని చేసి రాబోయే ఎన్నికల్లో రాహుల్‌ని ప్రధాన మంత్రి చేయడానికి కృషి చేస్తారని అన్నారు. రోజు రోజుకి కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని అన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వం ఈ దేశానికి ఎంతైనా అవసరమని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అధ్యక్ష బాధ్యతలు స్వీకరించి కార్యకర్తల్లో మనోస్థైర్యం నింపి పార్టీని పటిష్టం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, వుడా మాజీ అధ్యక్షుడు పీఎస్ఎన్ రాజు, పీసీసీ కార్యదర్శి గొంపా గోవిందరాజు, పీసీసీ మత్యకార విభాగం చైర్మన్ కంటుమచ్చు తాతారావు, కాంగ్రెస్ నాయకులు జగ్గుపల్లి అప్పలరాజు, గుత్తుల శ్రీను, గొంటు మోహన్‌రావు, కొయ్యా రామకృష్ణ, వార్డు అధ్యక్షులు లింగం శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, పర్వీన్ ఖాన్, మోనికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హరిజన జగ్గయ్యపాలెంలో దారుణం..

విశాఖ సిటీః కండెలి లాజరస్ అనే యువకుడు గడిచిన 5 రోజులుగా వారి ఇంటి సమీపంలో ఉంటున్న ఇద్దరు బాలికలను తన ఇంటికి టీవీ చూడడానికి రప్పించుకొని రోజూ అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యాచారయత్నం చేసినట్లు ఈ విషయం ఇంట్లో చెబితే చంపేస్తా అని బెదిరించాడు. భయపడిన ఆ బాలికలు ఏం చెప్పకపోవడంతో ఈ విషయం వెలుగులోకి రాలేదు. రెండు రోజులు క్రితం బాలికలు కడుపునొప్పి అని చెప్పడంతో అసలు విషయం బయటపడింది. సభ్యసమాజం తలదించుకునేలా జరిగిన ఈ సంఘటన స్థానికులను కలచివేయడం బాధాకరం. సంగతి తెలిసిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా నిత్యం ఏదో ప్రాంతంలో బాలికలపై, మహిళలపై ఇలాంటి సంఘటనలు జరగడం ఘోరం.. తక్షణమే ఆ యువకుడ్ని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని బీజేపీ నగర మహిళామోర్చా డిమాండ్ చేస్తోంది. ఇలాంటి మానవ మృగాలను నడి రోడ్డు మీద శిక్షించాలని, సమాజంలో బ్రతికే నైతిక హక్కు వారికి కల్పించ కూడదు అని డిమాండ్ చేస్తున్నామని మహిళా సమాజ సభ్యులు కోరుతున్నారు. ...బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి అని, ప్రభుత్వాన్ని కోరుతూ బీజేపీ మహిళామోర్చా బాధిత బాలికలకు అండగా ఉంటుంది అని తెలియజేస్తున్నామని సభ్యులు తెలిపారు.

## ఏయూతో

# లింకన్ విశ్వవిద్యాలయం ఎంఓయూ

### వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వర్సిటీల ప్రతినిధులు

ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్ర విశ్వవిద్యాలయంతో మలేషియాకు చెందిన లింకన్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. మంగళ వారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వ హించిన కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు సమక్షంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేవ్వర రావు. మలేషియాకు చెంది లింక్ విశ్వవిద్యాలయం సిఈఓ డాక్టర్ అమియా భౌమిక్‌లు సంతకాలు చేశారు. బోధన, పరిశోధన రంగాలలో సంయుక్తగా పనిచేయాలని ఇరు వర్సిటీల ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కలసి పనిచేస్తా మన్నారు. విదేశీ బాష అధ్యయనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తా మన్నారు. డాక్టర్ అమియా భౌమిక్ మాట్లాడుతూ లింకన్ విశ్వవిద్యాలయం ప్రపంచ వ్యాప్తంగా విభిన్న విద్యా సంస్థలతో కలసి పనిచేస్తోందన్నారు. అందరికీ విద్యను అందించాలనే ఉద్దేశంతో వర్సిటీ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య కె.నిరంజన్, లింకన్ కళాశాల అనాటమీ విభాగాధిపతి ఆచార్య కె.బి స్వామి, స్వచ్ఛాంధ్ర మిషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.ఎల్ వెంకట రావు, లింకన్ యూనివర్సిటీ కళాశాల ఇంటర్నేషనల్ పార్ట్నర్‌షిప్ రమేష్ పతి, ఏయూ మీడియా రిలేషన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ చల్లా రామక్రిష్ణ తదితరులు ప్రసంగించారు.

## విత్తనాల బంతులూ, గోళీలు చేద్దాం

# సామాజిక వనాలను పెంచుదాం

### ఎయు. రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు




ఆంధ్రా విశ్వవిద్యాలయంః ప్రతి ఒక్కరూ మీ ప్రాంతంలో లభించే ఫలాలను ఆరగించండి. ఆ ఫలాలలోని విత్తనాలను ఆరబెట్టి దాయాలనీ, విత్తన బంతులూ, గోళీలూ తయారు చేయాలనీ ఆంధ్రా విశ్వవిద్యాలయం రిజి స్ట్రార్ వెలగపూడి ఉమామహే శ్వర రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం పౌర గ్రంధాలయంలో డాక్టర్ సూరప నేని విజయకుమార్ అధ్యక్షతన పర్యావరణ మార్గదర్శి వైశాఖి సంస్థ విత్తనాల సేకరణ, వితన బంతులూ, గోళీల తయారు చేయడానికి రూపొందించిన ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురియగానే ఈ విత్తన బంతులు, గోళీలను అడవులు లేని కొండ ప్రాంతంలో చల్లి సామాజిక వనాలు పెంచడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎవరూ విత్తనాలను వృధాగా పడవేయవద్దు ప్రతి విత్తనం మొక్కై మొలకెత్తాలి. మనకూ, మన తర్వాత తరాలకూ మంచి ఫలాలను అందించాలి. పక్షులకూ, ఇతర జీవులకూ ఆహారాన్ని అందించాలి. అవి గూళ్ళు పెట్టుకుని నివశించడానికి అనువుగా ఉండాలన్నారు. గత ఏడాది లక్షా 60 వేల విత్తన బంతులు నగరం చుట్టూతా ఉన్న కొండల మీద చల్లారన్నారు. వాస్తవానికి ఏటా ప్రపంచ వ్యాప్తంగా 170 లక్షల హెక్టార్లలో అడవులు అభివృద్ధి అనే మీషతో మాయమవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఒకటి రెండు మొక్కలు నాటడం ద్వారా ఫలితం ఉండదు. ముందుగా అడవుల నరికివేత ఆపాలి. అలాగే ప్రతి విత్తనమూ మొక్కై మొలచి పెరిగి వృక్షమయ్యేలా చూడవలసిన బాధ్యత మనదీ, మన తర్వాత తరాలదీ. భూగోళం ఒక్క మనవాళి సొంతం కాదు. 15 మిలియన్లకు పైగా ఉన్న సమస్త జీవరాశి సొంతం. అన్ని జీవులతో మనకు చుట్టరికం ఉంది. ఏ జీవి అంతరించినా దాని దుష్ప్రభావం మానవాళి మీదే పడుతుంది. అన్ని జీవులకూ జీవించే హక్కు ఉంది. ఆ హక్కును మనం కాలరాయకూడదు. సమస్త జీవావరణాన్నీ జీవించనీయాలంటే అడవుల రక్షణ బాధ్యత మనమీదే ఉంది. అందుకనే మా వంతు కృషి చేస్తున్నాం. మీరూ భాగస్వాములు కావాలని కోరుతున్నాం. ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ విత్తన బంతుల ఆవశ్యకతను, అవి ఎలా తయారు చేయాలనే అంశాలను వివరిస్తూ విద్యా సంస్థల్లోనూ, విశాఖ నగరమంతా ఈ విత్తనాల బంతులు తయారు చేసేందుకు అవసరమైన కార్యక్రమాన్ని పిఎమ్‌వి కార్యకర్తలు చేపట్టారని ఆయన వివరించారు.

పిఎమ్‌వి ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ విజయకుమార్ మాట్లాడుతూ వేసవిలోనే కాదు సంవత్సరం పొడవునా పండే పండ్లను మనం ఆరగిస్తాం. ఆరగించే సమయంలో అందులో ఉండే గింజలను ఎక్కడికక్కడ పడవేయకుండా ఒక చోట ఆరబెట్టాలని కోరారు. ఆరిన తర్వాత ఒక చోట దాచి పెట్టాలి. అలాగే మనం విభిన్న ప్రాంతాలకు వెళ్ళే సమయంలో అక్కడెక్కడైనా విభిన్న చెట్లకు ఎండిన కాయలు వేలాడుతుంటాయి. వాటిని సైతం సేకరించండి అలా సేకరించిన విత్తనాలన్నింటినీ వర్షాకాలంలో మనం ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు కానీ, ఖాళీగా ఉన్న సమయంలో మైదాన ప్రాంతంలోనూ, రహదారికి ఇరువైపులా కానీ, కొండలున్న ప్రాంతంలో కానీ చల్లుకుంటూ పోతే ఆ విత్తనాలు మొక్క మొలిచి, పెరిగి పెద్దవై కాయలు కాస్తాయి. మనకు కాకపోయినా వేరెవరికైనా ఆ ఫలాలు ఆరగించేందుకు అవకాశం కలుగుతుంది. అంతేకాదు అవి సమస్త జీవావరణానికీ ప్రాణవాయువును అందజేస్తాయి. మనం ఒక్కరం ఆలోచిస్తే చాలదు మిగిలిన వారినీ ఆలోచింపజేసి కార్యోన్ముఖులను చేయాలన్నదే పిఎమ్‌వి ఆలోచన అని పేర్కొన్నారు.

జిఇఎస్ఎస్ అధ్యక్షురాలు పివి శిరీష మాట్లాడుతూ విత్తనాల బంతులు తయారీ కార్యక్రమంలో ప్రతి విద్యార్థీ పాల్గొనాలని పిలుపునిచ్చారు. మనం జీవిస్తున్న ఈ భూగోళం పచ్చదనంతో నిండాలి. భూఉపరితలం మీదున్న వేడిని చాలా వరకూ తగ్గించాలంటే పచ్చదనం పరిడవిల్లాలి. అందుకే మనమంతా విత్తనాల బంతులూ, గోళీలతో మన విశాఖ నగరంలోని కొండలను హరితమయం చేయాలి. స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 8897472088, 7382420996, 7207835806 నెంబర్లకు మీ పేరూ, వివరాలను నేరుగా లేదా ఎస్.ఎమ్.ఎస్ ద్వారా సంప్రదించ వలసిందిగా కోరుతున్నాం.

పిఎమ్‌వి కార్యదర్శి జె.రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులూ, పిఎమ్‌వి కార్యకర్తలూ సేకరించిన విత్తనాలను అందరికీ ఆమోదయోగ్యమైన రోజున ఆయా విద్యా సంస్థల్లో మట్టి, ఎరువూ కలిపి వాటిని బంతుల్లా, గోళీల వలే తయారు చేసి ఎండబెడదాం. ఎండిన వాటిని వర్షాలు కురిసిన తర్వాత పచ్చదనం కోల్పోతున్న మైదాన ప్రాంతాల్లోనూ, నగరం చుట్టూతా ఉన్న కొండల మీదా చల్లుదాం. వర్షాలు కురియగానే అవి తడిచి బంతుల్లోని విత్తనాల నుండి మొలకలు వస్తాయి. అవి అక్కడే అలా పెరిగి పెద్దవవుతాయి. ఈ విధనాన్ని ప్రతి ఒక్కరూ అమలు చేస్తే పచ్చని చెట్లు మనం నివశించే ప్రాంతమంతా పెరుగుతాయి. అందుకే ప్రతి ఒక్కరూ స్పందించాలని కోరుతున్నాం.

ఈ సమావేశంలో గ్రీన్ లీడర్స్ ప్రతినిది పి. పృధ్వీరాజ్, పిఎమ్‌వి కార్యకర్తలు ఐ.బాల శిరీష, యు.లావణ్య, జి. అనిరుద్, గొంపా సుష్మ, గ్లోరీ పుష్ప, పి. విజయ, జి.శ్యామల, పి.అరుణ, కె.మల్లిక, కె.రోహిణి, మున్నీషా మెహబూబ్, జె.రవితేజ, జి. దేవీప్రసాదు తదితరులు పాల్గొని మాట్లాడారు

# ఎండతీవ్రత దృష్ట్యా మాకూ సెలవులివ్వాలి

### వైకాపా స్టూడెంట్స్ అసోసియేషన్ వినతి



విశాఖపట్నం : జిల్లాలో గత రెండు రోజులుగా ఎండలు భయంకరంగా ఉండడం వలన జూనియర్ కళాశాల విద్యార్థులు ఆరోగ్యం దృష్ట్యా రెండు రోజుల పాటు ప్రైవేటు, ప్రభుత్వ, కార్పోరేట్ కళాశాలలకు ఎండ తీవ్రత తగ్గేవరకు సెలవు ప్రకటించ వలసినదిగా కోరుతున్నామని వైకాపా స్టూడెంట్స్ అసోసి యేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఎందుకనగా ఇంటర్మీడియట్ విద్యార్థు లందరూ 18 సంవత్సరాలలోపు వయస్సు మరియు మైనర్లుగా ఉన్న నేపథ్యంలో వీరు ఎండతీవ్రతను భరించ లేరు. కావున ఇప్పటికే ఎండల తీవ్రత దృష్ట్యా పాఠ శాలలకు కూడా సెలవు ప్రకటించిన నేపథ్యంలో వారిని ఆదర్శంగా తీసుకొని జూనియర్ కళశాల లకు కూడా సెలవు ప్రకటించవలసినదిగా ప్రార్థిస్తున్నామన్నారు. పై సమస్యను పరిష్కరించా లని వినతిపత్రం ఆర్.ఐ.ఓ. నగేష్‌కు సమర్పించిన ఉన్నత విద్యాశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావుతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు, రాష్ట్ర కార్యదర్శి బి.మోహన్‌బాబు చందు, ప్రసాద్, సునీల్, అనిల్, లీలాకృష్ణ, మధు, అయ్యప్ప, సూర్య, విద్యార్థులు పాల్గొన్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

**వార్షిక నిర్వహణ కాంట్రాక్టు**

టెండరు ప్రకటన నెం. WAT/TRD/54/17-18, తేదీ. 04.06.2018

పని పేరు మరియు ప్రదేశం: వాల్తేరు డివిజన్‌లో కొత్తవలస-కిరండుల్ సెక్షన్ యొక్క 47 కంట్రోల్డ్ పోస్టులు మరియు RCCలు కలిగియున్న SCADA ఎక్విప్‌మెంట్ 2 సంవత్సరాల కాలంనకు సమగ్ర వార్షిక నిర్వహణ కాంట్రాక్టు.

టెండరు విలువ: ₹ 57,70,536/-, బయానా: ₹ 1,15,420/-, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 5,900/-, పని పూర్తి చేయు కాలం: LOA తేదీ నుండి 24 నెలలు

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 23.07.2018న 1500 గంటలకు.

ఈ టెండరునకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు ఏవైనా అట్టి మాన్యువల్ ఆఫర్లు అందినచో తిరస్కరించబడతాయి.

ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు పూర్తి వివరాలు లభించు వెబ్‌సైట్: http://www.ireps.gov.in.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (TRD) విశాఖపట్నం

PR-164/J/18-19


# నేరెళ్ల వేణుమాధవ్ మృతికి వర్సిటీ సంతాపం

## 1978లో కళా ప్రపూర్ణతో సత్కరించిన ఏయూ

### వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు

ఆంధ్రాయూనివర్శిటీ : మిమిక్రీ కళతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును పొందిన నేరెళ్ల వేణుమాధవ్ మృతికి వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు సంతాపం వ్యక్తం చేశారు. మంచి కళాకారుని కోల్పోవడం తీరని లోటన్నారు. కొన్ని దశాబ్ధాలుగా మిమిక్రీ కళను అభివృద్ధి చేయడానికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలన్నారు. వర్సిటీ 1978వ సంవత్సరలో ఆయనకు కళాప్రపూర్ణను అందించడం జరిగిందన్నారు. వర్సిటీ గోల్డేన్ జూబ్లీ స్నాతకోత్సవంలో ఆయనను కళాప్రపూర్ణతో వర్సిటీ గౌరవించిందన్నారు.


**కెనరా బ్యాంక్** లాసన్స్ బే కాలనీ బ్రాంచి, విశాఖపట్నం ఫోన్ : 0891-2511548, 8331018980

**కారు వేలం / అమ్మకం**

| రిజిస్ట్రేషన్ నెం. | కంపెనీ | మోడల్ | రిజర్వు ధర | ధరావత్తు |
|---|---|---|---|---|
| AP 31 TV 8810 | TATA INDICA VISTA LS BSIV | 2015 | Rs.3,00,000/- | Rs.30,000/- |
| AP 31 TV 6155 | TATA INDICA VISTA LS BSIV | 2015 | Rs.2,80,000/- | Rs.28,000/- |

- కారు సందర్శించు తేదీ: 25-06-2018 ఉ॥గం॥11.30 ని॥ల నుండి.
- వేలము తేది మరియు సమయం: 26-06-2018 మ॥3.00గం॥లకు, ప్రదేశం:కెనరా బ్యాంక్, లాసన్స్ బే కాలనీ బ్రాంచి, విశాఖపట్నం వద్ద.
- ధరావత్తు డ్రాఫ్ట్:"కెనరా బ్యాంక్, లాసన్స్ బే కాలనీ బ్రాంచి వారి పేరున తీయవలెను.
- వాహనము "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలానే" పద్దతిలో విక్రయించబడును
- వేలం రద్దు చేయుటకు/వాయిదా వేయుటకు బ్యాంక్ వారికి సర్వ హక్కులు కలవు.

మరిన్ని వివరముల కొరకు సంప్రదించండి : 9966000868

తేది:19-06-2018 బ్రాంచి మేనేజర్

# విజయభాను సంపాదకీయం

## దేశానికి దిశా నిర్దేశం

నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ, రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన సూచనలు విధానకర్తలంతా మనసుపెట్టి పరిశీలించదగినవి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రసంగం సందర్భోచితంగా, దేశానికి దిశానిర్దేశం చేసేదిగా ఉండటం ప్రశంసనీయం. కేసీఆర్ ప్రసంగంలో రెండు ప్రధానాంశాలున్నాయి. కేసీఆర్ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి రంగాల్లో పరివర్తనకు సంబంధించి విశేషమైన సూచనలు చేశారు. దీనికి తోడు రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చి సమాఖ్య స్వరూపానికి వన్నె తేవడానికి సంబంధించినది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ అంతో ఇంతో సాగుతున్నప్పటికీ, రాష్ట్రాలకు అధికారాలను బదలాయించడం మాత్రం ఆశించిన మేర సాగడంలేదు. కేంద్రం అంతర్జాతీయ సంబంధాల వంటి కీలక అంశాలపై దృష్టిసారించి, మిగతా అభివృద్ధి అంశాలను రాష్ట్రాలకు బదలాయించాలనేది ఉత్తమమైన ప్రతిపాదన. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు కళ్ళెం వేయకుండా మరింత ప్రోత్సహించాలనేది కూడా కేంద్రం ఆలోచించవలసిన అంశం. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి సంబంధించి కేసీఆర్ నీతి ఆయోగ్ సమావేశంలో కేంద్రంలోని పెద్దలకు, రాష్ట్రాల ముఖ్యమంత్రులకు వివరించినవి వట్టి ప్రతిపాదనలు కావు. ఈ రంగాలకు జవజీవాలు అందించడానికి తాను తెలంగాణలో చేపట్టిన చర్యలను ఆయన వివరించారు. వ్యవసాయ రం గంతో సహా మొత్తం గ్రామీణరంగాన్ని సంపన్నం చేయడానికి కేసీఆర్ సమగ్ర వ్యూహాన్ని రూపొందించి అమల్లో పెట్టారు. కేసీఆర్ తెలంగాణలో వ్యవసాయరంగ ప్రయోగాలను ప్రారంభించడానికి ముందు మరే నాయకుడూ ఇటువంటి సాహసం చేయలేదు. వ్యవసాయరంగాన్ని చక్కబరుచడం సాధ్యం కాద నే భావనే దేశవ్యాప్తంగా ఉన్నది. కొందరు వ్యవసాయం దండుగ అని భావించారు. మరికొందరు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పుల నేపథ్యంలో, ఇప్పుడున్న వ్యవసాయ విధానాన్ని చక్కదిద్దడం సాధ్యంకాదని భావిస్తున్నారు. కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయరంగంలో ప్రవేశించడం కోసం ఎదురుచూడటమో, ఏర్పాట్లు చేయడమో మిగిలిందని వారి అభిప్రాయం. భారీ యాంత్రీకరణ జరిగితే తప్ప దిక్కులేదని భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా దాదాపుగా ఇదే ఆలోచన ఉన్నది. రాబోయే మార్పుల సంగతి ఎట్లా ఉన్నా, తక్షణం వ్యవసాయరంగాన్ని మెరుగుపరిచి, రైతులకు భరో సా ఇవ్వాలని, పరిశ్రమల మాదిరిగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని ఎవరూ ఆలోచించలేదు. కానీ కేసీఆర్ ఇందుకు వ్యవసాయ, గ్రామీణరంగాలను సుసంపన్నం చేసే సాహసోపేత ప్రయోగాలను విజయవంతంగా అమలు చేస్తున్నారు. రైతులను ఆదుకోవడానికి అనేక చర్యలను చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ విధానంలో మౌలిక మార్పులను కూడా తీసుకువస్తున్నారు. ఇప్పటివరకు రైతులకు తమ మట్టి ఎటువంటిదో, ఏ పంటలు వేయాలో చెప్పినవారు లేరు. పంటకు గిట్టుబాటు ధర లేకుంటే నిలువ చేయడానికి గోదాములు లేవు. మార్కెట్‌ను అధ్యయనం చేసే అలవాటే లేదు. జీవనోపాధి కోసం సాగించే సంప్రదాయ వ్యవసాయ విధానాన్ని లాభసాటి వ్యాపారంగా మార్పుచేయడం, అందులో రైతులను భాగస్వాములను చేయడం కేసీఆర్ వ్యవసాయ వ్యూహం. రైతులు నిలదొక్కుకునే క్రమంలో యాంత్రీకరణ, ఆధునీకరణ కూడా ప్రవేశిస్తాయి.

రైతులలో సమిష్టితత్వాన్ని పెంచాలన్న కేసీఆర్ ప్రయత్నం కూడా ప్రశంసనీయమైనది. రైతు సమితులను ఏర్పాటు చేయడంతో పాటు వారి సమస్యలు చర్చించుకోవడానికి వేదికలు నిర్మిస్తున్నారు. మార్కెటింగ్ మాత్రమే కాదు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ కూడా రైతు సమితుల ద్వారా సాగుతుంది. వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలు, ఎరువులు, కరెంటు, నీరు మొదలైనవన్నీ అందించడం వల్ల రైతులు ధైర్యంగా వ్యవసాయంపై దృష్టి పెడుతరు. సంప్రదాయంగా వ్యవసాయ వృత్తిలో ఉన్నవారు దెబ్బతినకుండానే, ఈ రంగాన్ని ఆధునికీకరించడం సాగుతున్నది. వ్యవసాయ అనుబంధరంగాల ప్రోత్సాహం కూడా కేసీఆర్ గ్రామీణాభివృద్ధి వ్యూహంలో ప్రధానమైన అంశం. పాడి పశువులు, కోళ్లు, గొర్రెలు, చేపల పెంపకం మొదలైన వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించాలని కూడా కేసీఆర్ నీతి ఆయోగ్ సమావేశంలో కోరారు. ఈ రంగాలకు పన్ను మినహాయింపు ఉండాలని కూడా సూచించారు. సమాజంలో తరతరాలుగా ఈ వృత్తుల్లో ఉన్నవారికి అందుకు సంబంధించిన నైపుణ్యాలుంటాయి. ఈ నైపుణ్యాలను, మానవ వనరులను చక్కగా ఉపయోగించుకుంటే, గ్రామ సౌభాగ్యం సాధ్యమవుతుంది. దీని ద్వారా వలసలు నివారించ వచ్చునని అన్నారు.

## అచ్యుతాపురంలో ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



అచ్యుతాపురం: అఖిల భారత కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ 48వ జన్మదిన వేడుకలు కాంగ్రెస్‌పార్టీ యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూండ్రపు అప్పారావు ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొండకర్ల గ్రామ సమీపంలో ఉన్న ఇచ్ఛా అనాధశ్రమంలో రాహుల్ జన్మదినం సందర్భంగా అనాధ పిల్లలచే కేక్ కట్ చేసి పిల్లలకు బిస్కట్‌లు, పండ్లు పంపిణీ చేశారు. అనాధశ్రమానికి బియ్యం, వంట సరుకులను కాంగ్రెస్‌పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ యలమంచిలి ఇన్‌ఛార్జి అప్పారావు మాట్లాడుతూ రోజురోజుకు కాంగ్రెస్‌పార్టీకి ఆదరణ పెరుగుతుందని, కాబోయే ప్రధానమంత్రి రాహుల్‌గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు తనకాల అనంతరావు, డిసిసి కార్యదర్శి కండపల్లి శ్రీనువాసరావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మడక చిన్న, డి.అప్పలరాజు, రావి రామసత్యం, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి సమర్థవంతమైన పాలన అందుతుంది

### నగర కాంగ్రెస్ శక్తి సంఘటన్ అధ్యక్షుడు కె గోపాల్‌రెడ్డి



అన్నదానం చేస్తున్న
నగర కాంగ్రెస్ శక్తి సంఘటన్ అధ్యక్షులు కె.గోపాల్‌రెడ్డి

విశాఖపట్నం : కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి సమర్థవంతమైన పాలన అందుతుందని నగర కాంగ్రెస్ శక్తి సంఘటన్ అధ్యక్షులు కె గోపాల్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ 48వ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం సీతమ్మధార పాప హోంలో చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తరువాత కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుందని అన్నారు. ఆయన నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఒక్క రాహుల్‌గాంధీ నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు పరిష్కారమై దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. రాహుల్‌గాంధీ ఆశయ సాధనకు పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి నాయకత్వంలో కార్యకర్తలు సమష్టిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తామన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమం చేపట్టామన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు బి మధుర, పాప హోం సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెదడు పోటుకు సత్వర వైద్యం అందించాలి



విశాఖపట్నం : బ్రెయిన్ స్ట్రోక్ మెదడు పోటు సంక్రమించినట్లు అనుమానం వస్తే సత్వర వైద్యం అందించాలని సీనియర్ న్యూరో రేడియోలజిస్ట్ డాక్టర్ సీబా శంకర్ దలై అన్నారు. మంగళవారం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో అయన మాట్లాడుతూ, మెదడు పోటు అనేది ఒక వ్యాధి అని, ఇది ఎవరికైనా వచ్చినచో అతని ఆరోగ్య, మానసిక, సామాజిక ఆర్థిక అంశాల బాగా ఇబ్బంది పెడుతుందని అన్నారు. మెదడు స్ట్రోక్ యువకుల్ని తాకితే అది మరింత బాధాకరం గా ఉంటుందన్నారు. ఒక దశాబ్ద కాలం క్రితం వరకూ ఈ వ్యాధి కేవలం 60 ఏళ్ళ వయసు వారికి మాత్రమే వచ్చేది, ప్రస్తుతం ఒత్తిళ్లకు తట్టుకోలేని వారు ఈ వ్యాధికి గురవుతున్నట్టు సర్వేల్లో తేలిందన్నారు. దీంతోపాటు నిశ్చల జీవాల శైలి, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణం గా యువతరానికి సంక్రమిస్తోందని ఆయన చెప్పారు జూన్ 14 2018 న అన్వేష్ వర్మ అనే 15 ఏళ్ల బాలున్ని సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందన్నారు. మెదడు నొప్పి కారణంగా అతని శరీరం లో కుడి భాగంలో పక్షవాతం సంభవించిందని సెవెన్ హిల్స్ వైద్యులు అన్నారు. దీంతో అతను మాట్లాడలేక పోయాడని, తల్లిదండ్రులకు తీవ్ర ఆందోళన సైతం కల్గిందని వివరించారు. అదే విధంగా జూన్ 15 న 21 ఏళ్ళ ఇంజనీరింగ్ విద్యార్థి షేక్ ఇమ్రాన్ అనే యువకుడు ఇదే లక్షణాలతోఆసుపత్రికి వచ్చారని, అతనికి ఎడమ వైపు పక్షవాతం వచ్చిందన్నారు. అతను గందరగోళం, మగత కారణంగా ప్రజలను గుర్తించలేని స్థితికి చేరుకున్నాడని తెలిపారు. వీరిద్దరికీ వెంటనే మెదడు ( సెరిబ్రల్ యాంజియోగ్రామ్ ) యొక్క ఆంజియోగ్రఫీ చేశామని, డాక్టర్ సీబా శంకర్ దలై, చికిత్స చేసి మెదడు లోని బ్లాక్ సైట్లో ఒక సన్నీని కాగెటర్ ను, మెదడు నుంచి గడ్డలను తొలగించడానికి యాంత్రిక త్రోమ్బెక్టమీ నిర్వహించారని తెలియచేశారు.

దాంతో మెదడు ప్రసరణ నిమిషాల్లో జరగడం ఆరంభించిందని వివరించారు. వీరిద్దరూ ప్రస్తుతం 24 నుంచి 48 గంటల్లో తమ పక్షవాతం నుంచి అభివృద్ధి చెందుతూ ఆరోగ్యాంగా ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్టు అన్నారు. వీరికి చికిత్స చేసిన వైద్యలు సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ న్యూరో రేడియోలజిస్ట్ డాక్టర్ సీబా శంకర్ దలై,డాక్టర్ మోహన్ డాక్టర్ కె. సురేష్ కుమార్, ఆర్ వి నారాయణ, డాక్టర్ కుచేల బాబు, లు ఉన్నారు.

## సమయం కవి

### 'అమ్మ'

నవమాసాలు మోసి
చావు బ్రతుకులు మధ్య
జన్మనిస్తుంది అమ్మ
గోరు ముద్దలు చేసి
తినిపించేది అమ్మ
అల్లరి చేసినా కోపగించక
బుజ్జగించేది అమ్మ
బుల్లి, బుల్లి అడుగులు వేసేటప్పుడు
పడకుండా కాపాడుతుంది అమ్మ
ఒంటికి అంటిన మట్టిని శుభ్రం చేసి
బుగ్గపై చుక్క పెడుతుంది అమ్మ
నిదురపోయిన బిడ్డపై చేయి వేసి
తృప్తిగా ఊపిరి పీలుస్తుంది అమ్మ.

...కవితా రచన
వైదా ఈశ్వరరావు
సెల్ నెం: 7674942843

## పంచాంగం

మాసం : నిజ జ్యేష్ఠ ; తిథి : సప్తమి ఉ.9.53; పుబ్బ ఉ.6.53; మ.వ.1.48ల 3.20.

బుధవారం 20-06-2018

**మేషం** : దైవ, పుణ్య కార్యాక్రమాల పట్ల చురుకుగా పాల్గొంటారు. దంపతుల మధ్య సఖ్యత నెలకొంటుంది. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు పోకుండా ఏకాగ్రతతో పని చేయవలసి ఉంటుంది. స్త్రీలకు ముఖ్యుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.

**వృషభం** : విద్యార్థులకు పోటీ పరీక్షల ఏకాగ్రత, సమయపాలన అవసరం. ఖాదీ, పట్టు, చేనేత, కలంకారీ వస్త్ర వ్యాపారులకు ఆటుపోట్లు తప్పవు. ఉపాధ్యాయులకు ఒత్తిడి, చికా కులు అధికమవుతాయి. స్త్రీలు ఇతరులతో మితంగా సంభాషించటం క్షేమదాయకం. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి.

**మిథునం** : వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. ఏ విషయంలోను ఇతరులపై ఆధారపడక స్వయంకృషినే నమ్ముకోవడం మంచిది. ప్రేమికులకు పెద్దల నుండి వ్యతిరేకత, ఇతర్రతా చికాకులు అధికమవుతాయి.

**కర్కాటకం** : మీ సంతానం పరీక్షల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆడిటర్లకు ఒత్తిడి, కాంట్రాక్టర్లకు లాభదాయకం. ఏ విషయంలోను నిరుత్సాహం చెందక అంతా మంచికేనని సర్దుకుపోవటం శ్రేయస్కరం. ఎల్.ఐ.సి పోస్టల్ ఏజెంట్లకు ఒత్తిడి, స్పెక్యులేషన్ రంగాల వారికి చికాకులు తప్పవు. బంధువుల మధ్య సయోధ్య నెల కొంటుంది.

**సింహం** : విద్యార్థులకు ఏకాగ్రత వల్ల అభివృద్ధి పొంద గలుగు తారు. కొత్త సమస్యలు తలెత్తె అవకాశం ఉంది. మెళుకువ వహించండి. మీ మాటకు సంఘంలోనూ, కుటుంబములోనూ ఆమోదం లభిస్తుంది. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదని గమనించండి. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు.

**కన్య** : స్త్రీలతో సంభాషించునపుడు సంయమనం పాటించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు ఏకాగ్రత ముఖ్యం. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనాలు తలకిందులవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు

**తుల** : కాంట్రాక్టర్లకు రావలసిన ధనం అందడంతో నిర్మాణ పనులు వేగవంతమవుతాయి. ఎదుటివారితో ఎలా మాట్లాడినా తప్పుగానే భావిస్తారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇతర్రతా ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇతరులకు వాహనం ఇచ్చేటపుడు లౌక్యం పాటించండి.

**వృశ్చికం** : ఎదుటివారి విషయాలలో జోక్యం చేసుకోవటం వల్ల మాటపడక తప్పదు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమస్యలు పరిష్కారం కాగలవు. పచారీ, ఫ్యాన్సీ, హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు పురోభివృద్ధి. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళకు లొంగకుండా స్థిరచిత్తంతో వ్యవహరించవలసి ఉంటుంది.

**ధనుస్సు** : కొంతమంది మీ నుండి ధనసహాయం ఆశించవచ్చు. వైద్యులకు చురుకు ధనం, ఆడిటర్లకు ఒత్తిడి, లాయర్లకు కలిసివచ్చే కాలం. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేస్తారు. గృహంలో మార్పులు, చేర్పులకై చేయు యత్నాలు ఫలిస్తాయి.

**మకరం** : ఉపాధ్యాయులకు ఒత్తిడి, అక్కౌంట్స్ రంగాల వారికి పనిభారం తప్పవు. స్త్రీలకు శ్రమాధిక్యత, మానసికాందోళనల వల్ల ఆరోగ్యము మందగిస్తుంది. చిన్నతరహా, కుటీర పరిశ్రమల వారికి ప్రోత్సాహకరం.ప్రముఖులను కలుసుకుంటారు.

**కుంభం** : స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవు తాయి. ఉద్యోగస్తుల తొందరపాటు చర్యలు, నిర్లక్ష్యం వల్ల కొత్త సమస్య లెదుర్కోవలసి వస్తుంది. పత్రిక రంగాల్లో వారు, రచయితలు ఆశించే మర్పులకోసం కొంత కాలం వేచియుండక తప్పదు.

**మీనం** : బ్యాంకు వ్యవహారాలు, ప్రయాణాల్లో మెలకువ వహించండి. ఎదుటి

## ప్రపంచం గర్వించదగ్గ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల

### - సంతాపం తెలిపిన ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు



డా॥ నేరెళ్ళ నుంచి జ్ఞాపికను అందుకుంటున్న
మిమిక్రీ శ్రీనివాస్ (ఫైల్ ఫోటో)



డా॥ నేరెళ్ళ (ఫైల్ ఫోటో )

ప్రపంచం గర్వించదగ్గ మిమిక్రీ కళాకారుడు పద్మశ్రీ నేరెళ్ళ వేణుమాధవ్ అని ఘంటసాల స్పోర్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. సినిమాలు చూసి 16 ఏళ్లకే మిమిక్రీ ధ్వని అనుకరణ నేర్చుకున్న నేరెళ్ళ దేశ, విదేశాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చి మిమిక్రీ కళకు అరుదైన గుర్తింపు తెచ్చిందన్నారు. నేరెళ్ళ ప్రతిభను గుర్తించి అనేక దేశాలు, విశ్వవిద్యాలయాలు ఎన్నో బిరుదులు, పురస్కారాలు అందజేశాయన్నారు.

ఐక్య రాజ్య సమితిలోను మిమిక్రీ ప్రదర్శనలు ఇచ్చిన ఘనత నేరెళ్ళకే దక్కిందన్నారు. నేరెళ్ళ చేసిన కళాసేవకు గుర్తుగా భారతరత్న, కళాప్రపూర్ణ, మిమిక్రీ సామ్రాట్, పద్మశ్రీ వంటి బిరుదులు ప్రదానం చేశాయన్నారు. నేరెళ్ళ పేరుతో పోస్టల్ స్టాంపును భారతప్రభుత్వం విడుదల చేయడం దేశం గర్వించదగ్గ విషయమని చెన్నా తిరుమలరావు అభివర్ణించారు. అటువంటి మహా మిమిక్రీ కళాకారుడు చనిపోవడం దురదృష్టకరమన్నారు.

**నేరెళ్ళను విశాఖకు తీసుకొచ్చే అదృష్టం నాకే దక్కింది**

*- ఎం.ఎస్. ఎంటర్‌టైనర్స్ అధినేత మిమిక్రీ శ్రీనివాస్*

ధ్వని అనుకరణను ప్రపంచంలో దశదిశలా వ్యాపింపజేసిన మిమిక్రీ కళాకోవిదులు డా॥ నేరెళ్ళ వేణుమాధవ్ మరణం దేశానికే పెద్ద లోటని ఎం.ఎస్.ఎంటర్‌టైనర్స్ అధినేత మిమిక్రీ శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. మిమిక్రీ గురుబ్రహ్మ డా॥ నేరెళ్ళ వేణుమాధవ్‌ను పదకొండుసార్లు విశాఖపట్నానికి తెచ్చి అదృష్టాన్ని తనకే దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. ఆయన సమక్షంలో రాష్ట్రంలో ఉన్న మిమిక్రీ కళాకారులందరినీ వేణుమాధవ్ సమక్షంలో ప్రదర్శనలు ఇప్పించి వేణుమాధవ్‌తో సత్కారాలు, జ్ఞాపికలు ఇప్పించాలని గుర్తు చేశారు. నేరెళ్ళను కడసారి చూపుకోసం వరంగల్ వెళ్లినట్టు చెప్పారు.

**మిమిక్రీ కళకు ఆయనకు ఆయనే సాటి**

- విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు క్యాలు జనార్ధన్

భాష ఏదైనా ధ్వని ఎలాంటిదైనా నేరెళ్ళ వేణుమాధవ్ గొంతులో ఇమిడిపోవాల్సిందేనని, విశాఖ కళాకారుల సంక్షేమ ఏ గొంతునైనా అనుకరించి మెప్పించగల సత్తా ఆయనకే దక్కుతుందని విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు క్యాలు జనార్ధన్ పేర్కొన్నారు. ప్రకృతిలోని శబ్ధాలు, పక్షుల కూతలు, అనేక బాషలకు చెందినవని ధ్వని అనుకరణలు ఏకకాలంలో చూపించగలిగిన పద్మశ్రీ నేరెళ్ళ వేణుమాధవ్ మరణం ప్రపంచ కళారంగం ఊహించలేనిదన్నారు.

ఇంగ్లీష్ సినిమాలు చూసి అందులో సన్నివేశాలను బట్టీ పట్టి యావత్ ప్రపంచానికే తలమానికంగా నిలిచాయన్నారు. అంత గొప్ప మిమిక్రీ కళాకారుడిని కోల్పోవడం బాధాకరమన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను Minimum 7 days క్లాసిఫైడ్స్ సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# బీసీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాల్సిందే . . . .

## ఆంధ్రప్రదేశ్ బీసి ఐక్య సంఘాల ఐక్య వేదిక తీర్మానం



విశాఖపట్నం : రాష్ట్రం లో సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాల్సిందేనని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంఘాల ఐక్య వేదిక తీర్మానం చేసింది. మంగళవారం విశాఖ నగరం లోని ద్వారకానగర్ లో గల ఒక హోటల్ లో జరిగిన ఐక్య సంఘాల ప్రతినిధుల సమావేశం లో ఈ తీర్మానం చేసినట్టు ఏ పీ బీసీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు దువ్వారపు రామారావు తెలిపారు. బీసీ వర్గాల ఐక్య వేదిక సమావేశం ముగిసిన తదుపరి నిర్వహించిన విలేకరుల సమావేశం లో అయన మాట్లాడుతూ. . ఈ రాష్ట్రం లో గత దశాబ్దాలుగా తమకు తగినంత రాజకీయ ప్రాధాన్యత ఇవ్వలేదని, అన్ని రాజకీయ పార్టీలు తమను కేవలం ఒక ఓటు బ్యాంకు లాగానే చూస్తున్నాయి తప్ప, తమ పాలనా సామర్థ్యాన్ని గుర్తించలేదన్నారు. ఈ క్రమం లోనే రానున్న 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పరంగా ఎదగవలసిన అవసరాన్ని గుర్తించి విశాఖ లో ఈ ఐక్య సంఘాల సమావేశాన్ని నిర్వహించామన్నారు. గతం లో విజయవాడలో మొదటి సమావేశం జరిగిందని, అక్కడ తీసుకున్న నిర్ణయాలను కూలంకషంగా చర్చించేందుకు రెండవ సమావేశం జరుగుతోందన్నారు. విజయవాడలో జరిగిన తొలి సమావేశం లో 12 మంది సమన్వయ కర్తలను నియమించామని తెలిపారు. ఇంతవరకూ తమకు జరిగిన నష్టాన్ని ఇక కొనసాగించకూడదని, 2019 లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ సమాహారం ఎలా ఉండబోతోంది అనే అంశం పై చర్చించేందుకు ఈ సమావేశం లో చర్చించామన్నారు. గత నాలుగు రోజులుగా ప్రధాన దేవాలయాల్లో ని నాయి బ్రాహ్మణులూ చేస్తున్న నిరసనలకు తాము అండగా నిలబడతామని, వారి కనీస డిమాండ్లను నెరవేర్చాలి అని సంఘీభావం తెలియచేస్తున్నామన్నారు. తమ సంఘాల డిమాండ్లను అందరికీ తెలియచేసే విధంగా అతి త్వరలో బహిరంగ సభ జరపడం గాని, సర్వ సభ్య సమావేశం నిర్వహించడానికి సమాయత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ బీసి ఐక్య సంఘాల ఐక్య వేదిక సమన్వయ కర్త గూడూరి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ విజయవాడలో జరిగిన మొదటి సమావేశం లో సుమారు రెండు వందల మంది కీలక ప్రతినిధులు తీసుకున్న నిర్ణయం ప్రకారం తీర్మానాలు చెయ్యవలసిన అవసరం ఉందని తెలిపారు. రానున్న కాలం లో రాజకీయంగా ఎదగవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తమకు ఆంధ్ర ప్రదేశ్ లోని అన్ని నియోజకవర్గాల్లోనూ తగినంత ఓటు బ్యాంక్ ఉందని, అధికంగా ఉన్న ప్రాంతాల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ విధంగా ఇచ్చే వారికే తమ సంఘీభావం తెలియడం జరుగుతుందని తెలియచేసారు. జిల్లాల వారీగా సంఘాలను బలోపేతం చేసి, 2019 ఎన్నికల ద ృష్ట్యా రాజకీయం గా ఏ నిర్ణయం తీసుకోవాలి అనేది నిర్ణయిస్తామన్నారు.కార్యక్రమం లో ఐక్య వేదిక సమన్వకమిటీ ప్రతినిధులు తుమ్మిడి రామ్ కుమార్, టి అర్జున రావు, విజయవాడ డిప్యూటీ మేయర్, ఐక్య వేదిక ఉపాధ్యక్షులు, యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ఆడారి కిషోర్ కుమార్, జివి రమణా రావు, యు. కోటేశ్వర రావు, ఎం వివిఎస్ ఎం మూర్తి, ఎం వి రావు, యాచారయ్య, పి. ఆదినారాయణ, మహిళా సమన్వయ కర్తలు వై. లక్ష్మి గిరిజ, రాధా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు జగదల్‌పూర్ విమానం ప్రారంభం

విశాఖపట్నం: ఎయిర్ ఒడిశా, గుజరాత్ స్టేట్ ఎక్స్‌పోర్టు కార్పొరేషన్‌లు జగదల్‌పూర్-విశాఖపట్నం-జగదల్‌పూర్‌ల మధ్య ఈనెల 20 నుండి కొత్త విమానాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎయిర్ ట్రావలర్స్ అసోసియేషన్(ఇండియా) అధ్యక్షులు డి.వరదారెడ్డి తెలిపారు. ఉడాన్ పథకం కింద ప్రారంభించే ఈ విమానం ద్వారా ప్రయాణికులు చత్తీస్‌ఘడ్‌లో సుందరమైన పర్యాటక ప్రాంతాలను వీక్షించే అవకాశం కలుగుతుందని ఆయన తెలిపారు. జగదల్ పూర్‌కు దగ్గరలో నయాగరా జలపాతం తరహాలో చిత్రకోట్ జల పాతం ఉందని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మరిన్ని విమానాలను పెంచాల్సిన సంకేతాలు కనిపిస్తున్న నేపథ్యంలో మరిన్ని విమానాలు ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా 68 సర్వీసుల రాకపోకలకు గానీ, సింగపూర్, కౌలలంపూర్, దుబాయ్, శ్రీలంకలకు రాకపోకలు జరిపే విమానాలకు గానీ తాజా నిర్ణయం వలన ఎటువంటి ఇబ్బంది లేదని, ప్రయాణికులు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవడం లేదని వరదారెడ్డి పేర్కొన్నారు.

## గురుకుల కళాశాల ప్రక్షాళనకు చర్యలు చేపట్టండి

**- ఇంటర్‌లో 5 శాతం ఫలితాలు సిగ్గు సిగ్గు**
**- సమగ్ర విచారణ జరిపి ,భాద్యులు పై చర్యకు డిమాండు**
**- తెనుగుబూడిలో పూర్వ విద్యార్థుల మహా ధర్నా**



దేవరాపల్లి : తెనుగుబూడిలో పాఠశాల ,కళాశాల ప్రారంభం నుంచి మంచి ఫలితాలు సాధించిన గురుకులం 2017 -18 ఇంటర్ ఫలితాల్లో కేవలం 5 శాతానికి దిగజారిపోవడం సిగ్గు చేటు అని పుర్వ విద్యార్థులు ధ్వజమెత్తారు .ఇంటర్ లో 5 శాతం ఫలితాలకు నిరసనగా స్థానిక గురుకుల కళాశాల వద్ద పుర్వ విద్యార్థులు మంగళవారం మహా ధర్నా చేపట్టారు .ఈ సందర్బంగా ముఖ్య నాయకులు మాట్లడుతూ ప్రభుత్వ విద్యను ప్రత్సాహిస్తున్న

తరణంలో అదే ప్రభుత్వ గురుకులాల్లో విద్యను దూరంచేసి ఎస్టీ ,ఎస్సి పిల్లలను నాశనం చేసే ప్రయత్నానికి కుట్ర జరుగుతుందని అరోపించారు .ప్రిన్సెపాల్ ,సిబ్బంది నిర్లక్షము కారణంగానే చాల మంది విద్యార్థుల భవిష్యత్ రోడ్డున పడిందన్నారు .అందుకు కారకులైన వారిపై సమగ్ర విచారణ జరిపి ,భాద్యులుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .ఇది వరకే జిల్లా కలెక్టరు ,ఎస్ సి .ఎస్ టి ,కమిషన్ చెర్మన్ కు వినతి పత్రాలు అందజేశామన్నారు .ఇప్పటికేనా తమ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు .తెనుగుబూడి గురుకుల సిబ్బంది ,ప్రిన్సుపాల్ ను సస్పెండ్ చేసేంత వరకు అందోళన కొనసాగుతుందని వారు హెచ్చరించారు .ఇంటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల రాష్ట్ర అద్యక్షులు చిట్టయ్య, సంఘ నాయకులు రవి సిద్దార్థ, కొత్తపల్లి వెంకట రమణ ,చిట్టిబాబు ,మురళి, బల్లంకి కానక రాజు ,కె.విశేశ్వరావు, త్రినాద్, మచ్చ వీర్రాజు, జగదీష్, అప్పారావు, గాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా దుర్గాలమ్మ, కుంచాలమ్మ వార్షిక పండుగ మహోత్సవాలు

**అమ్మవార్లను దర్శించుకున్న ఆలయ దర్మకర్త పెంటకోట త్రినాధరావు**



కంచరపాలెం : జీవీఎంసీ 41 వ వార్డు కంచరపాలెం పరిది అశ్వన్ పాలెం వద్ద కొలువై ఉన్న శ్రీ దుర్గాలమ్మ ,కుంచాలమ్మ వార్షిక పండుగ మహోత్సవ వేడుకలు మంగళవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వెక్కువ జామునుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు . వేడుకల్లో పాల్గున్న ఆలయ దర్మకర్త అయిన టీడీపి 41 వ వార్డు అద్యక్షుడు పెంటకోట త్రినాధరావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఈ సందర్బంగా ఆయన మాట్లడుతూ గత ఏడాది ఆలయ నిర్మాణపనులు పూర్తి చేసి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ చేసామన్నారు. అందులో భాగంగా ఈఏడాది వార్షిక వేడుకలు నిర్వహించమన్నారు.

దుర్గాలమ్మ ,కుంచాలమ్మ వార్షిక పండుగ మహోత్సవ వేడుకల్లో బాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అకర్షించాయి.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 41 వ వార్డు అద్యక్షుడు నంబాల మధుసూధనరావు, కమిటీ సభ్యులు కే .శివ, ఎల్.బోగేష్, ఎస్.కృష్ణ, పి.అప్పారావు, సి.హెచ్ పైడిరాజు, పాపారావు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఎట్టకేలకు రైల్వే పాసులు

**- ఉత్తర్వులు విడుదల చేసిన మంత్రిత్వశాఖ**
**- నేటి నుంచి ప్రధాన రిజర్వేషన్ కార్యాలయంలో జారీ**
**- ప్రతి రోజు ఉదయం 11 నుంచి 12 గంటల వరకు పరిమితం**
**- డిఆర్ఎంతో పాటు రైల్వే ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలియజేసిన వైజాగ్ జర్నలిస్టుల ఫోరం**



విశాఖపట్నం: విశాఖ జిల్లాలో అక్రిడేటెడ్ జర్నలిస్టులకు బుధవారం నుంచి రైల్వే పాసులు మంజూరు చేయనున్నారు. ఈ మేరకు రైల్వే మంత్రిత్వశాఖ నుంచి ఇక్కడ కార్యాలయ వర్గాలకు మంగళవారం ఉత్త ర్వులు (టిసి 11/2704/2009) అందాయి. రైల్వే బోర్డుకు చెందిన డైరెక్టర్ పాసింజర్ మార్కెటింగ్ ఉన్నతాధికారి ఎస్.శ్రీవాత్సవ ఈ ఉత్తర్వులు విడుదల చేయడం జరిగింది. అన్ని జోనల్ రైల్వేస్ పరిధిలోనూన ఈ ఉత్తర్వులు తక్షణమే అమలు చేయాలని సదరు అధికారి ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పటివరకు కొన్ని ప్రాంతాల్లో జర్నలిస్టులకు రైల్వేపాసులు మంజూరు చేసినప్పటికి వాల్తేరు డివిజన్ మాత్రం తమకు రైల్వే బోర్డు నుంచి తగిన ఉత్తర్వులు రాలేదని పాసులు జారీ చేసే ప్రక్రియను నిలిపివేసింది. దీంతో వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు గంట్ల శ్రీనుబాబు, ఎస్.దుర్గారావు నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు డిఆర్ఎమ్ శరణ్‌మాథూర్‌ను రెండుసార్లు కలిసి పాసుల జారీకి వినతిపత్రాలు సమర్పించడం జరిగింది. దీంతో పాటు విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి సభ్యులు పివిఎన్.మాధవ్ సైతం రైల్వే మంత్రిత్వశాఖతో పాటు ఉన్నతాధికారులతో జిల్లాలో రైల్వేపాసులు జారీకి సంబంధించి మాట్లాడటం జరిగింది. ఈ మేరకు రైల్వే బోర్డు బుధవారం నుంచి రైల్వేపాసుల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉత్తర్వులు 2704/2009 పాలసీ ప్రకారం ఉత్తర్వులు జారీ చేస్తూ తగిన ఆదేశాలు ఇచ్చారు. దీంతో బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు రైల్వేపాసులు జారీ చేయనున్నారు. ప్రధాన కార్యాలయంలో ప్రతీరోజు జర్నలిస్టుల రైల్వేపాసులు జారీ చేస్తారు. ఈ మేరకు పాసులు జారీకి కృషి చేసిన రైల్వే డిఆర్ఎమ్ శరణ్‌మాథూర్‌తో పాటు ఎంపీ హరిబాబు, ఎమ్మెల్సీ మాధవ్, ఇతర జర్నలిస్టుల సంఘాలకు వీజెఎఫ్ కార్యవర్గం కృతజ్ఞతలు తెలియ జేసింది. ఈ మేరకు వీజేఎఫ్ ఉపాధ్యక్షులు ఆర్.నాగరాజు పట్నాయక్, నానాజీ, దాడి రవికుమార్, మూర్తి తదితర కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రతి ఒక్కరికి లైసెన్సు తప్పనిసరి

**జడ్పీటీసీ పైలా**



పరవాడ: వాహనాలు నడిపేవారు విధిగా లైసెన్సులు తీసుకుని ప్రమాదాలు జరగకుండా నివారించాలని పరవాడ జడ్పీటీసీ పైల జగన్నాధరావు అన్నారు. మండలంలోని పరవాడ, తాణం పంచా యతీ కార్యాలయం వద్ద మీ ముంగిట్లో రవాణా శాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థాయిలో లైసెన్సులు తీసుకునే వారికి పరీక్షా శిబిరాల నిర్వహణా కార్యక్రమాన్ని తాణం లో జిల్లా ప్రాదేశిక సభ్యులు పైల జగన్నాధరావు, పరవాడలో పరవాడ సర్పంచ్ చుక్కా రామునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్నాధరావు మాట్లాడుతూ పారదర్శకతతో కూడిన ఏర్పాటుచేసి లైసెన్సులు పొందేలా ప్రభుత్వం ఈ విధానాన్ని సులభతరం చేసిందన్నారు. ఈ కార్యక్రమం లో గాజువాక ఆర్ టి ఓ శివ ప్రసాద్, అనకాపల్లి మోటార్ వెహికిల్స్ ఇనస్పెక్టర్ వి.వి.వేణు గోపాల్, ఎఫ్‌సిఐ మెంబర్ పైల సన్యాసి రాజు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## జీవన ఎరువుల తయారుపై శిక్షణ



దేవరాపల్లి : జీవన ఎరువుల తయరుపై దేవరాపల్లిలో మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సాంకేతిక యజమాన్య సంస్థ అధ్వర్యంలో రైతులకు జీవన ఎరువుల తయారు విధానం, ఉపయోగాలు వివరించారు .వరిలో విత్తనశుద్ధి కి సూడోమోనాస్ కలిపే విదానం ,పొడి విత్తనాన్ని విత్తనశుద్ధి చేయడం ,నారు కట్టలను సూడోమోనాష్ కలిపిన నీటిలో ముంచి నాటుట ,నారు పై పిసికారి చేయు విధానాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అదికారి డి.అప్పారావు, అదనపు విస్తరణాధికారి టి.సత్యనారయణ , ఎటిఎం లు తమ్ము నాయుడు ,హేమ ,ఎంపీఓ లు సత్య రావు ,రామునాయుడు, దివ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ రుణమంజూరుకు ఇంటర్వ్యూలు

భీమునిపట్నం : వివిధ కార్పొరేషన్ల ద్వారా ఉపాధి సబ్సిడి రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నవారికి భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూ లు నిర్వహించారు. తాటితూరు,అన్నవరం,పెద్ద నాగమయ్య పాలెం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు కొనసాగాయి. ఎమ్పీడీవో కె.హరిప్రసాదరావు ఆద్వర్యంలో బ్యాంకు అధికారులు సంబం ధిత సిబ్బంది అభ్యర్డుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఇంటర్వ్యూ లకు సుమారు 280 మంది హాజరు అయ్యారు ఈ కార్యక్రమం లో ఎం.పి.పి యరబాల క్రిష్ణవేణి ,జెడ్పిటిసి ఎస్.అప్పారావు, బి.సి.వెల్ఫేర్ అధికారులు, విస్తరణాదికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ కార్పొరేషన్ల ద్వారా ఉపాధి సబ్సిడి రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నవారి భీమిలి జోనల్ కార్యాలయం లో ఇంటర్వ్యూ లు నిర్వహించారు భీమిలి జోనల్ కార్యాలయం పరిధికి చెందిన లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు కొనసాగాయి.జోనల్ కమిషనర్ బి.సన్యాసి నాయుడు ఆద్వర్యంలో బ్యాంకు అధికారులు సంబంధిత సిబ్బంది అభ్యర్డుల ధ్రువపత్రాలను పరిశీలించారు.

ఇంటర్వ్యూలకు సుమారు 350 మంది హాజరు అయ్యారు.ఈ కార్యక్రమం లో టి.పి.ఆర్ ఓ శ్రీనివాసరావు , బి.సి.వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

# విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాల్సిందే

**- సిపియం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం**



విశాఖపట్నం : విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ కోసం ఉత్తరాంధ్ర ప్రజలతో పాటు ముఖ్యంగా విశాఖ వాసులకు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. నాలుగురోజుల క్రితం విశాఖ ఎంపీ హరిబాబు రైల్వేజోన్‌పై రాజకీయ నిర్ణయం తీసుకున్నారని ప్రకటించారు. దానికి విరుద్ధంగా కేంద్ర రైల్వే శాఖా మంత్రి ఢిల్లీలో నిన్న రాష్ట్ర విభజన చట్టంలోని ఎపికి కొత్త రైల్వేజోన్ అంశం పరిశీలించాలనే వుందని, ఇవ్వాలని ఎక్కడా లేదని చెప్పడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. నిన్నమొన్నటి వరకు విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పిలికిన బిజెపి నేతలు నేడు రైల్వేజోన్ అంశం పరిశీలనే తప్ప ఇవ్వాలని లేదనడం దుర్మార్గం. బిజెపి నేతలు ఒక్కరికొకరు పొంతనలేకుండా మాట్లాడడం పట్ల విశాఖ ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర విభజన చట్టంలో 6నెలలో ఆంధ్ర రాష్ట్రంలో రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బిజెపి, తెలుగుదేశం విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఇస్తామని పదేపదే ప్రకటించారు. విశాఖ బిజెపి ఎంపి కంభంపాటి హరిబాబు, తెలుగుదేశం ఎమ్మెల్యేలు, నాయకులు మేము ఎలాగైనా తీసుకొస్తామన్న వారు నేడు ఎందుకు మౌనంగా వున్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసిన బిజెపి, టిడిపి అభ్య ర్థిని గెలిపిస్తే విశాఖ కేంద్రంగా జోన్ వచ్చి తీరుతుందని చెప్పి మరీ ఓట్లు వేంచుకున్నారు. కేంద్రంలో అధికారంలో వున్నది బిజెపి ప్రభుత్వం. బిజెపికి చెందిన విశాఖ ఎంపి, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎందుకు రైల్వేజోన్ తేవలేకపోయారో విశాఖ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల మనోభావాలను దెబ్బతీసిన బిజెపి, టిడిపి ప్రభుత్వాలకు పోరాటాల ద్వారా తగిన బుద్ధిచెప్పాలి. ఆంధ్ర రాష్ట్ర ప్రజల ఆందోళనలు అర్థం చేసు కోకుండా అడ్డగోలుగా రాష్ట్రాన్ని విభజించారు.

## నేటినుంచి రెవెన్యూ గ్రామసభలు

రోలుగుంట : మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు 22ఎ సవరణ అభ్యంతరాలపై నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్చడానికి 21 పంచాయతీల్లో రెవెన్యూ గ్రామసభలను నిర్వహించ నున్నట్లు తహశీల్దార్ అప్పలనాయుడు తెలిపారు. జులై 2న గుండుబాడు, 3న జేపిఅగ్రహారం, 4న జగ్గంపేటతదితర గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని చెప్పారు.

# అనాధ పిల్లలకు అన్నదానం

భీమునిపట్నం : తగరపువలస లో ప్రముఖ వ్యాపారస్థులు దుర్గా చంద్రరావు వర్ధంతి సందర్భంగా భీమిలి నవజీవన్ అనాధా శ్రమంలోని పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయన కుమారుడు దుర్గామూర్తి మాట్లాడుతూ నాన్న వర్ధంతి సందర్భంగా అనాద పిల్లలకు ఆకలి తీర్చడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ అవకాశం కల్పించిన వుయ్ కేర్ యు సంస్థ సభ్యులందరికి ధన్యవాదాలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో వజ్రేష్,చందన్, వుయ్ కేర్ యు ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు మురళి,వెంకటలక్ష్మి,సుశీల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు దేవరాపల్లి మండల సమావేశం

దేవరాపల్లి : మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ డి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని అయన కొరారు. సర్వసభ్య సమావేశాలకు హాజరు కానీ అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

**ఎల్‌జిఆర్ పట్టా పడిపోయినది**

యానాం భీమనగర్‌కు చెందిన పువ్వల ఎర్రియ్యా S/o. సత్తియ్యా చెందిన ఎల్‌జిఆర్ ఇంటిపట్టా డి/2/11/81 బ్లాక్ నెంబర్ డి/2 భూమి వివరం డి/2/11 పడిపోయింది. ఈ నెల 12 వ తేదీన భీమ్‌నగర్ ఇంటివద్దనుండి ఆఫీసు నిమిత్తం యానాం వస్తుండుగా ఏటిగట్టు రోడ్డు మార్గం మధ్యలో పడిపోయింది. ఇది ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయవలసిందిగా కోరుతున్నాం.

పువ్వల ఎర్రియ్యా,
S/o. సత్తియ్యా,
డోర్ నెంబర్ 9-3-067,
భీమ్‌నగర్, యానాం,
సెల్ నెంబర్ 7995199789.

# పేద విద్యార్థులకు ఎమ్మెల్యే వాసుపల్లి భరోసా



విశాఖపట్నం : నిరుపేద విద్యార్థులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఫీజులకు ఆర్థిక సాయం చేయడమే కాకుండా పుస్తకాలు అందచేశారు. 25వ వార్డులో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పేద విద్యార్థులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దీంతోపాటు ఆయా పాఠశాల, కళాశాల యాజమాన్యాలతో మాట్లాడి ఫీజులు తగ్గిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసుపల్లి దానేష్, మైలపల్లి శ్రీను, గుంపిన అప్పలరాజు, బొట్టా పరదేశీయాదవ్ బెహరా వెంకటరత్నం, వినయ్, సారిపిల్లి సంతోష్ పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజల్ ధరల పెంపునకు వినూత్న రీతిలో నిరసన, ర్యాలీ



అనంతగిరి: మండలంలో లుంగపర్తి పంచాయతీ పులుసుమామిడి గ్రామంలో రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి చెట్టి.వినయ్ ఆధ్వర్యంలో పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని బైక్లకు, ఆటోలకు తాడు కట్టి లాగుతు వినూత్న రీతిలో నిరసన ర్యాలీ చేపట్టారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు అనంతగిరి మండల యువజన విభాగ అధ్యక్షులు జె.విశ్వనాథం. మాజీ సర్పంచి గుంట.నాగర్జున, వార్డ్ మెంబర్స్ తాంగుల. పోట్టన్న, బడ్నాయిని.అప్పలస్వామి, యూత్ నాయకులు వెంకటేష్, క్రిష్ణ మూర్తి, అప్పన్న, డ్వాక్రా మహిళల సంఘ అధ్యక్షులు బులమ్మ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పుదుచ్చేరికీ ప్రత్యేక హెూదా రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలి

## సిఎం నారాయణ సామి డిమాండ్

యానాం : పుదుచ్చేరికి ప్రత్యేక హెూదా, రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణసామి ఢిల్లీలో జరిగిన నీట్ ఆయోగ్ సమావేశంలో డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చే విధంగానే కేంద్ర ఆర్థిక సంఘంలో పుదుచ్చేరికి సభ్యుత్వం కల్పించాలని కోరారు. పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంగా ఉండటం వలన కేంద్రానికి చెల్లించే పన్నులద్వారా వచ్చే 40 శాతం వాటా రావడం లేదని కేంద్ర హెూంశాఖ ఇవ్వవలసిన నిధులు ఇవ్వకుండా తొక్కిపెడు తుందన్నారు. ఈ అంశాలపై కేంద్ర ప్రముఖులు ఎలాంటి నిర్ణయం ప్రకటించకున్నా రాష్ట్రమైతే పుదుచ్చేరి మినహా మిగిలిన ప్రాంతాల భవిష్యత్ ఏమిటన్న అంశాంపై మళ్ళీ భయాందోళనలు మొదలవుతున్నాయన్నారు. బిజెపి నేతృత్వంలోని ఎండిఎ కూటమి ప్రభుత్వం లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడితో పుదుచ్చేరి కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు ఏళ్ళుగా ఎదుర్కొంటున్న సమస్యల నేపధ్యంలో రాష్ట్రహెూదా అంశం మళ్ళీ తాజాగా తెరపైకి వచ్చింది. కొద్ది రోజుల్లో నిర్వహించే బడ్జెట్ సమావేశాలలో రాష్ట్ర హెూదా విషయమై మరో తీర్మానం చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రత్యేక హెూదా రాష్ట్రప్రతిపత్తి గురించి సిఎం నారాయణసామి ప్రస్తావిస్తున్న విషయంపై పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు స్టేట్ హుడ్ విషయంలో తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని యానాం ఉనికికి హానీ కలిగించే విషయంలో ప్రజాభిప్రాయానికే తాను కట్టుబడి ఉంటానని తెలిపారు. పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంగా ఉండాలన్నదే తన నిర్ణయం అని ప్రత్యేకహెూదా వచ్చేందుకు అవకాశాలు ఏమి ఉన్నాయని ప్రశ్నించారు.

# చంద్రన్న బీమా అందజేత



పరవాడ : మండలంలో వెన్నెలపాలెం చెందిన మాసవరపు నరేష్ (25),పైల మహేష్ (26),లాలం నర్సింగరావులు ఈ నెల (17)వ తేదీన తిక్కవాని పాలెం సముద్రంలో నీటమునిగిన ప్రమాదం మృతి చెందారు. ప్రభుత్వ ఎన్టీఆర్ చంద్రన్న బీమా పథకం కింద తక్షణ సాయం రూ.5వేలు చోప్పున ఈ రోజు మృతుల నామినిలైన మాసవరపు నరేష్ తల్లి భవానికి,పైల మహేష్ బార్యకిగౌతమకి,లాలం నర్సింగరావు తల్లి దాలమ్మకి వెన్నెలపాలెం ఎంపిటిసి పైల సన్యాసిరావు చేతులమీదగా అందజేసామని పరవాడ బీమామిత్ర ఏసురత్నం తెలిపారు. మిగతా రూ.495000 సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను మృతుల నామినీలకు పెద్ద కర్మ రోజున అందజేస్తామని పరవాడ బీమా మిత్ర ఏసురత్నం తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి రెవిన్యూ గ్రామ సభలు

తాళ్లరేవు: గ్రామ స్థాయిలో నిషేధిత భూముల సమస్యలపై ఈ నెల 20 నుంచి 28 వరకు పంచాయతీలవారిగా రెవిన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ లోదా జోసఫ్ తెలిపారు. 20 ఉదయం 10 గంటలనుండి 5 గంటల వరకు జి.మల్లవరం, 21న జి.హేమవరం, 22న నీలపల్లి, యింజిరం, 23 సొల్లంగి, ఉప్పంగల, 25న పోలేకూరు, సుంకరపాలెం, 26న పటవల, 27న పిల్లంక, లచ్చిపాలెం, 28న సొల్లంగి, కొరంగి పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించనున్నామన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మతిస్థిమితంలేని మహిళ అదృశ్యం

తాళ్లరేవు: సీతారం పురానికి చెందిన గెద్దాడి మల్లీశ్వరి (38) మతిస్థిమితం లేక ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్ళిపోయింది ఇప్పటి వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకి కోసం బంధువుల ఇళ్ళకు వెళ్ళిన ప్రయోజనం లేకుండా పోయింది. దీనిపై భర్త వెంకటరమణ ప్రసాద్ కోరంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కోరంగి ఎఎస్ఐ సుబ్బారావు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

## ఉచిత ఆరోగ్య శిబిరం

పెద్దాపురం: పెద్దాపురం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పెద్దాపురం మునిసిపాలిటీ పరిధిలో మునిసిపల్ సెంటర్ వద్ద ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మెప్మా టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. శైలజ తెలిపారు. 40 మంది సిబ్బందితో ఈ ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరుగునని ఉదయం 9 గంటలనుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచితంగా వైద్యసేవలు అందించబడునని తెలిపారు. కంటి వైద్యంతోపాటు, ఇతర వ్యాదులకు సంబంధించి ఎనిమిది వైద్యసేవలు అందించబడునని ఇప్పటివరకు సుమారు 250 మందికి వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## భగభగలాడుతున్న పెద్దాపురం

పెద్దాపురం: అసలే మెట్ట ప్రాంతం, నీటి నిల్వలు తక్కువ, దానికి తోడు రోడ్లు విస్తరణ పేరుతో ఎండాకాలంలో నీడనిచ్చే అతిపురాతన వృక్షాలను నేలమట్టం చేయడంతో ఎండవేడికి ప్రజలు మలమల మాడిపోతున్నారు. 41 డిగ్రీల సెంటిగ్రేడ్ ఎండతో నివాసలలో ఉన్నవారు కూడా క్రింద, పైన వేడికి తట్టుకోలేకపోతున్నారు. రోడ్లు ఉదయం 10 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్నాయి. త్రాగునీరు కరువు, వృద్ధులు, పిల్లలు వేడికి తాళలేక తల్లడిల్లిపోతున్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు

కొత్తపల్లి: మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఆంజనేయస్వామి గుడి సెంటర్లో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు ఏఐసిసి సభ్యులు ఓలేటి రాయి భాస్కర్ రావ్ ఘనంగా నిర్వహించారు కేక్ కట్ కట్ చేశారు స్వీట్స్ పంచారు ఈ కార్యక్రమంలో రాయి భాస్కర్ రావు మాట్లాడితు 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొంది రాహుల్ ప్రధాని కావడం ఖాయమని కొనియాడారు ఈ కార్యక్రమంలో కొప్పుల మధుసూదనరావు తలారి త్రిమూర్తులు మాజీ ఎంపిటిసి కాకరపల్లి గంగాధర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 1 న గుంటూరులో పోరుబాట



రావులపాలెం: జూలై 1న గుంటూరులో జరుగు పోరుబాట ఉద్యమానికి గోడ పత్రికను విడుదల చేసిన ఎమ్‌పిపి కోట చెల్లయ్య. 2004 తరువాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన అభ్యర్థులకు నూతన పింఛను విధానాన్ని ప్రభుత్వం అమలు చేసిందని, ఈ నూతన విధానం వల్ల రిటైర్‌మెంటు తరువాత భద్రత లేని జీవితం గడపాల్సి వస్తుందని రావులపాలెం సిపిఎస్ మండల అధ్యక్షులు కార్తిక్ అన్నారు. తమ సమస్యపై పరిష్కారానికై జూలై 1న గుంటూరులో పోరుబాట ఉద్యమం చేస్తున్నామని, ఈ సందర్భముగా స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సిబ్బంది, ఎమ్‌పిపి కోట చెల్లయ్య చేతులమీదుగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి. రామకృష్ణ, బండారు నారాయణ, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఉమా కాంతం, ఎమ్‌డి ఇబ్రహిఖాన్, బి. విజయలక్ష్మి, విఆర్‌ఓలు జి. లక్ష్మిపతి, నూర్‌భాషా మీరాసాహెబ్, ఏడుకొండలు, సూర్యకాంతం, ఎస్‌టియు నాయకులు అడపా శ్రీనివాసరావు, పి. బాబూరావు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా- ఖాధర్

అమలాపురం: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వైఎస్‌ఆర్‌సిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాధర్ పేర్కొన్నారు. జిల్లాలో జగన్ నిర్వహిస్తున్న మహా సంకల్ప యాత్రకు ముస్లీంలు అందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఖాధర్ స్వగృహంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఖాధర్ మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, సిజిసి సభ్యులు కుడుపూడి చిట్టబ్బాయి, మాజీ మంత్రి, అమలాపురం వైఎస్ ఆర్‌సిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, అమలాపురం పార్లమెంటు ప్రెసిడెంట్ పిల్లి సుభాష్‌చంద్రబోస్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాధర్ భాషాకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఖాధర్‌కు అభినందనలు తెలిపినవారిలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంసాని నాని, చెల్లుబయిన శ్రీనివాస్, వాసంశెట్టి సత్యం, మట్టపర్తి నాగేంద్ర, మట్టపర్తి మురళీకృష్ణ, సూదా గణపతి, బొంతు గోవిందు శెట్టి, ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బషీర్ మరియు మత పెద్దలు, యువకులు తదితరులు ఉన్నారు.

*ఆలమూరు కోర్టు సమీపంలో రూ. 75 లక్షలతో నిర్మించే ఉప ఖజానా కార్యాలయ భవననిర్మాణానికి ఈ నెల 20వతేదీన శాసనమండలి వైస్ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మాణ్యం శంకుస్థాపన చేయనున్నట్లు ఎస్.టి.ఓ. రంగారావు తెలిపారు.*

# ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు



యానాం : ఎఐసిసి అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను యానాంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం యానాం బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఓల్డేజ్ హెూంలో భారీ కేక్‌ను మునిసిపల్ మాజీ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు కేక్ కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఓల్డేజ్ హెూంలో వృద్ధులకు, చిన్నారులకు స్వీట్లు, మామిడిపళ్ళు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని యానాం పురవీధులో కాంగ్రెస్ నాయకులు ప్రదర్శన నినర్వహించరు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి సభ్యులు ఎంఎకె జిలాని, టేకుమూడి వెంకటరావు, మల్లాడి విష్ణుమూర్తి, మల్లాడి సత్తిబాబు, మోకా అర్జమ్మ, చీకట్ల సత్యనారాయణ, పి. డేవిడ్, ఎల్. బంగారం, బి. బలరాం, ఎల్‌బి రామకృష్ణ, ఎం. వెంకటేశ్వర్లు, ఎ. నారాద, వందలాదిమంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉజ్వల, జన్‌ధన్ యోజన పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలి

## - జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్



విశాఖపట్నం: ఉజ్వలయోజన, జన్‌ధన్ యోజన, జీవన్ జ్యోతి భీమాయోజన, సురక్షా బీమాయోజన తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ ప్రవీన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావశ మందిరంలో డిప్యూటీ సెక్రటరీ పురుషోత్తంతో కలసి పౌర సరఫరాలు, అయిల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమై కేంద్ర పథకాల అమలుతీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉజ్వల యోజన పథకం క్రింద అర్హులైనవారందరికీ గ్యాస్ కనెక్షన్లు సిలిండర్లు అందేలా చూడాలన్నారు.

జన్‌దన్ యోజన పథకం క్రింద అర్హులు అందరిచే ఎటువంటి ధరావత్తు లేకుండా ఖాతాలను తెరిపించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించే బ్యాంకు మేనేజర్లుపై చర్యలు తీసుకోవాలని ఎల్.డి.ఎం.ను ఆదేశించారు.

కేంద్ర పథకాల అమల్లో యాస్పిరేషనల్ జిల్లాగా విశాఖను గుర్తించిన నేపథ్యంలో గ్రామ స్వరాజ్ అభియాన్ పథకాలను పటిష్టంగా అమలు పర్చాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా నీతి అయోగ్ డిస్ట్రిక్ట్ ప్లాన్ ప్రకారం జిల్లాలో విద్య, ఆరోగ్యం, న్యూట్రిషన్, స్కిల్ డవలప్‌మెంట్, వ్యవసాయం తదితర కార్యక్రమాలను పటిష్టంగా అమలు పర్చేందుకు సెక్టారు వారీగా నోడల్ అధికారులను నియమించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఒ రామశాస్త్రి, డిఎస్‌ఒలు, ఎల్‌డిఎంలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు హెల్మెట్ ధరించాలి

యానాం : ఉపాధ్యాయులు ప్రతిఒక్కరూ వాహనాలపై ప్రయణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని విద్యాశాఖ అధికారి కాలే సాయినాద్ తెలిపారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించిన సందర్భంగా వారిని ఉద్ధేశించి మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ప్రయణించడం వలన పుదుచ్చేరిలో విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రోడ్డు ప్రమాదంలో మరణించారని తెలిపారు. ఆదివారం 216 జాతీయ రహదారిలో ట్రాక్టర్ ప్రమాదంలో విద్యార్థి దాసరి సాయిజైసూర్య మృతిచెందారన్నారు. హెల్మెట్ ధరించి ఉంటే అతనికి ఏప్రమాదం జరిగి ఉండేదికాదని ఆవేదన వ్యక్తంచేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని పాఠశాలలకు తీసుకువచ్చే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పాఠశాల సమయం మించిపోతుందన్న ఆందోళనతో వేగంగా మోటారు వాహనాలు నడపకుండా కాస్తా ముందుగానే బయలుదేరాలని రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తిచేశారు.



దొండపర్తి 15వ వార్డు పరదేశమ్మ ఆలయం వద్ద మంగళవారం 15, 31, 44 వార్డుల ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసుపల్లి గణేష్‌కుమార్ పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సత్యన్నారాయణరెడ్డి, నాగేంద్ర, లక్ష్మీశివప్రసాద్, కోటీశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, జివిఎంసి అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ప్రతిభా ప్రోత్సాహానికి ఏడుగురు విద్యార్థులు ఎంపిక

ఆలమూరు : స్థానిక జూనియర్ కళాశాలకు చెందిన 7గురు విద్యార్థుల జాతీయ ప్రతిభా ప్రోత్సాహానికి ఎంపికయినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వి. రామలక్ష్మి తెలిపారు.

పి.సువర్ణజ్యోతి, కె.సువర్ణ, కె.ధనప్రియ, జె.యమున, కె.జ్యోతి, కె.మోహన్‌కుమార్, జి.శిరీష ఎంపికయిన వారిలో వున్నారని ఆమె తెలిపారు. వీరికి మూడేళ్ళుపాటు డిగ్రీలో ఏడాదికి రూ.10వేలు చొప్పున, పి.జి. చేసే రెండేళ్ల సమయంలో ఏడాదికి రూ.20వేలు అందజేయనున్నట్లు ఆమె వివరించారు. ఎంపికయిన విద్యార్థులకు ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలియజేసారు.

# చిత్రభాను

## నీ డ్రగ్స్, సెక్స్ రాకెట్స్ త్వరలో బయటకొస్తాయి

### శ్రీరెడ్డి కామెంట్స్ ఎవరిపై?



చికాగోలో తెలుగు సెక్స్ రాకెట్ బట్టబయలవ్వడం, అందులో పలువురు తెలుగు హీరోయిన్లకు సంబంధం ఉందని తేలడంతో ప్రపంచం మొత్తం నివ్వెరపోయింది. అమెరికా లాంటి దేశాల్లో కూడా మన వాళ్లు ఇలాంటి నీచమైన దందాలు చేస్తున్నారా? అంటూ తెలుగు రాష్ట్రాల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సెక్స్ రాకెట్ నేపథ్యంలో సంచలన తెలుగు నటి శ్రీరెడ్డి సోషల్ మీడియాలో చేసిన కామెంట్స్ హాట్ టాపిక్ అయ్యాయి. తనకు అన్యాయం చేశాడంటూ తెలుగు సినిమా పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ హీరోను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. నేచురల్ నల్లత్రాచు అంటూ అతడిపై శ్రీరెడ్డి ఫైర్ అయ్యారు. కొన్ని రోజులుగా శ్రీరెడ్డి ఓ ప్రముఖ హీరోపై ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. అతడిని ఉద్దేశించే ఆమె తాగా మరోసారి సంచలన కామెంట్స్ చేశారు. గతంలో తనను అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి సెక్సువల్‌గా వాడుకున్నాడని, ఇప్పుడు తన నోటికాడ కూడా లాక్కున్నాడని ఆమె వాపోయారు. చికాగో పోలీసుల మాదిరిగా మన పోలీసులు కూడా రంగంలోకి దిగితే నీ డ్రగ్స్, సెక్స్ రాకెట్స్ బయటకు వస్తాయి అంటూ సదరు హీరో పేరు ప్రస్తావించకుండా శ్రీరెడ్డి కామెంట్స్ చేశారు. బూతులు ప్రయోగించిన శ్రీరెడ్డి తన పోస్టులో శ్రీరెడ్డి ఆ హీరోను నేచురల్ నల్లత్రాచు అంటూ సంబోధిస్తూ రాయడానికి వీల్లేని బూతులు ప్రయోగించింది. తనకు అన్యాయం చేయడమే కాకుండా, ఇపుడు బిగ్ బాస్ లాంటి టీవీ షోలలో అవకాశాలు రాకుండా చేస్తున్నాడని ఆమె ఆగ్రహంతో ఊగిపోతున్నారు. తీగ లాగాను, డొంక కదిలింది 'తీగ లాగాను, డొంక కదిలింది. మన వాళ్లు చిన్న ప్రాబ్లమే అని లైట్ తీసుకున్నారు... అమెరికన్ పోలీస్ సీరియస్‌గా తీసుకున్నారు. అందుకే అమెరికా రంగంలోకి దిగింది. గొడవ ముదరకముందే తలసాని వారు, మా అసోసిషన్ వారు కలిసి మా ప్రాబ్లమ్స్ చక్కబెడతారో... లేక నాకు కార్డ్ ఇవ్వకుండా కాకమ్మ కథలు చెప్పినట్లు అమెరికన్ పోలీసులకు చెబుతారో చూద్దాం... అంటూ శ్రీరెడ్డి ఫేస్ బుక్ పేజీలో మరో ఆసక్తికర పోస్టు చేశారు.

## జూ. పవర్ స్టార్ అని పిలిస్తే బ్లాక్ చేస్తా: రేణు దేశాయ్ వార్నింగ్



పవన్ కళ్యాణ్ అభిమానులు ఆయన కొడుకైన అకీరా నందన్‌ను ముద్దుగా జూ పవర్ స్టార్ అని పిలించుకుంటారు. పవన్ కళ్యాణ్ సినీ వారసుడు అతడే అని, భవిష్యత్తులో ఆయన వారసత్వంతో తెలుగు సినిమాను ఏలుతాడని ఫ్యాన్స్ ఆశ పడుతున్నారు. అందుకే ఇప్పటి నుండే కుర్రోడికి జూ పవర్ స్టార్ అంటూ సెలబ్రిటీ స్టేటస్ ఇచ్చేసి హైప్ తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అయితే తన కుమారుడిని పవన్ అభిమానులు ఇలా పిలవడం రేణు దేశాయ్‌కు అస్సలు నచ్చడం లేదు. దీనిపై ఆమె ఘాటైన కామెంట్స్ చేశారు. తన కుమారుడు అకీరాను ఎవరైనా జూ పవర్ స్టార్ అంటూ పిలిస్తే ఊకుకునేది లేదని రేణు దేశాయ్ మండి పడ్డారు. అలా పిలిచిన వారిని సోసల్ మీడియా పేజీలో బ్లాక్ చేస్తానంటూ రేణు దేశాయ్ వార్నింగ్ ఇచ్చారు. జూనియర్ పవన్ కళ్యాణ్ అని పిలవడం అకీరాకు, వాడి నాన్నకు, వాడి అమ్మనైన నాకు ఇష్టం లేదు. కాబట్టి మీరు అలా అనడం ఆపండి అని రేణు దేశాయ్ సూచించారు. కొడకును చూసి మురిసిపోయిన రేణు నా క్యూటీ చూడటానికి యురోపియన్ సినిమాలోని ఓ సీరియస్ క్యారెక్టర్‌లా ఉన్నాడు. ఓ గేమ్ కోసం తన ల్యాప్‌టాప్‌లో ఆసక్తిగా వెతుకుతున్నాడు.... అంటూ తన కొడుకు ఫోటో పోస్టు చేసి మురిసిపోయింది రేణు దేశాయ్.

ఫ్యాన్స్ అసంతృప్తి అయితే రేణు దేశాయ్ అలా చెప్పడంపై కొందరు అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పవర్ స్టార్ కొడుకును జూ పవర్ స్టార్ అని పిలవడంలో తప్పేంటని కొందరు ప్రశ్నించారు. అయితే కొందరు మాత్రం రేణు దేశాయ్ వాదనతో ఏకీభవిస్తూ ఇకపై అలా పిలవబోము అని తెలిపారు.

## నేను ఆరోగ్యంగా.. దృఢంగా ఉన్నా: రానా



కథానాయకుడు రానా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని కొంతకాలంగా వార్తలు వెలువడుతున్నాయి. చికిత్స నిమిత్తం అమెరికా వెళున్నారని రజనీకాంత్‌కి చెకప్ చేస్తున్న వైద్యుడే రానాకూ చికిత్స అందిస్తున్నారని వదంతులు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ వార్తలపై రానా స్పందించారు. తాను ఆరోగ్యంగా, ధృఢంగా ఉన్నట్లు పేర్కొన్నారు. 'నా ఆరోగ్యం విషయంలో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. నేను ఫిట్‌గా, ఎనర్జిటిక్‌గా ఉన్నాను. కానీ బీపీ సంబంధిత సమస్యలు ఉన్నాయి. దానివల్లే నా కంటి శస్త్ర చికిత్సకు ఆలస్యం అవుతోంది. అంతకుమించి ఎలాంటి సమస్యలు లేవు. నా చేతిలో ఉన్న వరుస సినిమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాను. చిత్రీకరణల నిమిత్తం ముంబయి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణాలు చేస్తూనే ఉన్నాను' అని తెలిపారు. ప్రస్తుతం రానా 'హిరణ్య' చిత్రంతో బిజీగా ఉన్నారు. బాలీవుడ్‌లో వచ్చిన 'హాథీ మేరే సాథీ' సినిమాకి ఇది రీమేక్. ప్రభు సాల్మన్ దర్శకుడు. అలనాటి నటుడు రాజేశ్ ఖన్నాకు నివాళిగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మరోపక్క మలయాళంలోనూ రానా నటించబోతున్నారు. ట్రావన్‌కోర్ మహారాజు మార్తాండ వర్మ బయోపిక్‌లో రానా నటించనున్నారు.

## ఒక్కొక్కడికి మూడు చెరువుల నీళ్లు తాగించా... ఇదో లెక్కా? : బిగ్‌బాస్‌తో బాబు గోగినేని



బిగ్ బాస్ తెలుగు రెండో సీజన్ రసవత్తరంగా సాగుతోంది. తొలి వారం జరిగిన ఎలిమినేషన్లో మిస్ హైదరాబాద్ సంజన షో నుండి ఔట్ అయిన సంగతి తెలిసిందే. షో నుండి వెళుతూ తనకు దక్కిన బిగ్ బాంబ్ అవకాశాన్ని బాబు గోగినేనిపై ప్రయోగించింది. దీని ప్రకారం వారం రోజుల పాటు బిగ్ బాస్ ఇంట్లో ఎవరికి నీళ్లు అవసరం వచ్చినా బాబు గోగినేని తీసుకెళ్లి ఇవ్వాలి. తనపై సంజన వేసిన బిగ్ బాంబును బాబు గోగినేని సంతోషంగా స్వీకరించడంతో పాటు ఆమెపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బిగ్ బాస్ షోకి రాక ముందు తాను అనేక టీవీ డిబేట్లలో ఒక్కొక్కడికి మూడు చెరువుల నీరు తాగించాను..... అలాంటి నాకు ఇంట్లో వారికి నీళ్లు ఇవ్వడం పెద్ద కష్టం ఏమీ కాదు. బిగ్ బాస్ చెప్పినట్లు రూల్స్ తప్పకుండా ఫాలో అవుతాను అని బాబు గోగినేని తెలిపారు. సంజన తనపె ఇలాంటి బాంబు ఎందుకు వేసిందో తెలియదని, ఇది ఆమె చేసిన పిచ్చి పనిగా బాబు గోగినేని పేర్కొన్నారు.

సంజనను బిగ్ బాస్ ఇంట్లో తాను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదని, నాపై కోపం ఎందుకు పెంచుకుందో తెలియదు అన్నారు. నాపై అభిమానంతో, ప్రేమతో ఇంట్లోకి కొంత మంది మిత్రులు సంజన వేసిన బిగ్ బాంబ్ రూల్ బ్రేక్ చేసి.... ఎవరి నీళ్లు వారే పట్టించుకుంటామని అంటున్నారు. కానీ రూల్స్ బ్రేక్ చేయడం నాకు ఇష్టం లేదు. బిగ్ బాస్ చెప్పినట్లు నేను చేస్తాను అని ఈ సందర్భంగా బాబు గోగినేని స్పష్టం చేశారు. ఎలిమినేషన్ అయి బిగ్ బాస్ ఇంటి నుండి బయటకు వెళుతూ సంజన సంచలన కామెంట్స్ చేశారు. బాబు గోగినేని బయటకు కనిపించేంత మంచి మనిషి కాదని, అతడితో జాగ్రత్తగా ఉండాలని ఇంటి సభ్యులకు సూచించింది.

## ఆ సినిమా నన్నెంతో మెప్పించింది: మహేశ్ బాబు






విశాల్, సమంత జంటగా నటించిన చిత్రం 'అభిమన్యుడు'. పీఎస్ మిత్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తమిళంలో 'ఇరుంబు తిరై'గా విడుదలైన ఈ చిత్రం తెలుగులో కాస్త ఆలస్యంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సైబర్ క్రైమ్ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు. అయితే ఇటీవల ఈ సినిమా చూశానని తనను ఎంతో మెప్పించిందని అంటున్నారు సూపర్‌స్టార్ మహేశ్ బాబు. ' 'అభిమన్యుడు' సినిమా నన్నెంతో మెప్పించింది. దర్శకుడు పీఎస్ మిత్రన్ ఈ సినిమా ద్వారా తన నైపుణ్యాలను ప్రేక్షకుడికి తెలియజేశారు. చక్కగా పరిశోధన చేసి ఈ సినిమా తీశారు. విశాల్‌కు, చిత్రబృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. 'భరత్ అనే నేను' చిత్రంతో మంచి విజయం అందుకున్న మహేశ్ ప్రస్తుతం వంశీ పైడిపల్లి తెరకెక్కిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో మహేశ్‌కు జోడీగా పూజా హెగ్డే నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు. 'రాజసం', 'రైతుబిడ్డ' అనే టైటిళ్లను పరిశీలిస్తున్నారు. ఈ చిత్రంలో మహేశ్ మీసం, గెడ్డంతో ఎప్పుడూ చూడని గెటప్‌లో కన్పించనున్నట్లు తెలుస్తోంది. దాంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## యావరేజ్ టాక్ వచ్చినా వసూళ్లు అదరగొడుతోంది



బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ నటించిన 'రేస్ 3' మూవీ ఇండియాలో అదిరిపోయే కలెక్షన్లతో దూసుకెళుతోంది. కలెక్షన్ల పరంగా తానే బాలీవుడ్ రియల్ సికిందర్ అని మరోసారి ప్రూవ్ చేసుకున్నాడు. రెమో డిసౌజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ యావరేజ్ టాక్‌లోనూ భారీ ఓపెనింగ్స్ సాధించింది. తొలి మూడు రోజుల్లోనే 100 కోట్లు వసూలు చేసింది. అంతే కాదు పలు బాలీవుడ్ రికార్డులను ఈ చిత్రం బద్దలు కొట్టింది. కేవలం సల్మాన్ ఖాన్ మీద ఉన్న క్రేజ్ వల్లే ఇది సాధ్యమైందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రేస్ 3 మూవీ తొలి రోజు రూ. 29.17 కోట్లు వసూలు చేసింది. మర్నాడు ఈద్ పండగ హాలిడే కావడం కూడా బాగా కలిసొచ్చింది. దీంతో శనివారం రోజు రూ. 38.14 కోట్లు రాబట్టింది. ఇదే జోరు ఆదివారం కూడా కంటిన్యూ అయి రూ. 38.16 కోట్లు రాబట్టింది. దీంతో తొలి మూడు రోజుల్లో రూ. 106.47 కోట్లు రాబట్టింది. సల్మాన్ ఖాన్ మూవీ తొలి మూడు రోజుల్లో రూ. 100 కోట్లు అందుకోవడం ఇది నాలుగోసారి. గతంలో ఆయన నటించిన బజరంగీ భాయిజాన్, సుల్తాన్, టైగర్ జిందా హై చిత్రాలు తొలి మూడు రోజుల్లోనే ఈ ఫీట్ సాధించాయి. 2018లో విడుదలైన సినిమాల్లో..... రేస్ 3 మూవీ సెకండ్ బిగ్గెస్ట్ వీకెండ్ ఓపెనర్‌గా నిలిచింది. మొదటి స్థానంలో రూ. 114 కోట్లతో 'పద్మావత్' ఉండగా... రేస్ 3 తర్వాతి స్థానంలో రూ. 73.10 కోట్లతో బాగీ, రూ. 41.01 కోట్లతో రైడ్, రూ. 40.05 కోట్లతో పాడ్‌మ్యాన్ చిత్రాలు ఉన్నాయి.

## శిఖర్ ధావన్‌కి కెరీర్‌లో
# బెస్ట్ ర్యాంక్..!



న్యూఢిల్లీ : అఫ్ఘానిస్థాన్‌తో గత వారం ముగిసిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో శతకం బాదిన భారత ఓపెనర్ శిఖర్ ధావన్ కెరీర్‌లో బెస్ట్ ర్యాంక్‌ని అందుకున్నాడు. ఐసీసీ తాజాగా విడుదుల చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో ధావన్ 10 స్థానాలు ఎగబాకి 24వ ర్యాంక్‌ని అందుకున్నాడు. అతనికి జోడీగా ఆ టెస్టులోనే సెంచరీ సాధించిన మురళీ విజయ్ కూడా ఆరు స్థానాల్ని మెరుగుపర్చుకుని 23వ స్థానంలో నిలిచాడు. ఈ ఓపెనింగ్ జోడి శతకాలకి తోడు బౌలర్లు కూడా సమష్టిగా రాణించడంతో రెండు రోజుల్లోనే ఆ టెస్టుని ముగించిన భారత జట్టు ఇన్నింగ్స్, 262 పరుగుల తేడాతో అలవోకగా గెలుపొందిన విషయం తెలిసిందే.

అఫ్ఘానిస్థాన్‌తో టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ రవీంద్ర జడేజా బౌలర్ల జాబితాలో ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని మూడో స్థానంలో నిలవగా.. ఫాస్ట్ బౌలర్లు ఇషాంత్ శర్మ, ఉమేశ్ యాదవ్ రెండేసి స్థానాలు ఎగబాకి 25, 26వ స్థానాల్లో నిలిచారు. టీ20ల్లో అగ్రస్థానం, వన్డేల్లో రెండో స్థానంలో ఉన్న అఫ్ఘానిస్థాన్ స్పిన్ సంచలనం రషీద్ ఖాన్.. ఏకైక టెస్టులో ఘోరంగా విఫలమవడంతో.. అతను 119 స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

# ఫుట్‌బాల్ వరల్డ్‌కప్‌లో ముగ్గురు భారత బాలికలు



మాస్కో: ముగ్గురు భారత బాలికలకు అరుదైన అవకాశం వచ్చింది. ప్రస్తుతం రష్యాలో జరుగుతున్న ఫుట్‌బాల్ వరల్డ్‌కప్‌లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. పంజాబ్‌కు చెందిన జస్‌ప్రీత్ కౌర్, సోనియా రాణి, బల్జిందర్ కౌర్‌లు 15 రోజుల పాటు రష్యాలో జరిగే స్పోర్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ యూత్ సెమినార్లలో పాల్గొంటారు. జస్‌ప్రీత్ కౌర్ సంధానకర్తగా వ్యవహరించనుండగా.. సోనియా రాణి, బల్జిందర్ కౌర్ యంగ్ లీడర్స్‌గా వ్యవహరించనున్నారు. ఫిఫా ఫౌండేషన్ ఫెస్టివల్ ద్వారా వీళ్లకు ఈ అవకాశం దక్కింది. ప్రపంచవ్యాప్తంగా 18 నుంచి 25 ఏళ్ల వయసున్న అథ్లెట్లు 200 మందిని ఎంపిక చేసి వాళ్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా ఆరుగురు సంధానకర్తలు, 48 మంది డెలిగేషన్ లీడర్స్, 58 మంది యంగ్ లీడర్స్‌ను ఎంపిక చేశారు. దీనికి ఎంపికైన ముగ్గురు భారతీయ బాలికలు కొన్నేళ్లుగా యూత్ ఫుట్‌బాల్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. మహిళా క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ అకాడమీ పని చేస్తుంది. ఓ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన తనకు ఇంత గొప్ప అవకాశం దక్కడం సంతోషంగా ఉన్నదని జస్‌ప్రీత్ చెప్పింది.

## మిమిక్రీ లెజెండ్
# నేరెళ్ల వేణుమాధవ్ కన్నుమూత
### ఐక్యరాజ్యసమితిలో ప్రదర్శన ఇచ్చిన ఏకైక తెలుగు కళాకారుడు



వరంగల్: ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్(85) మంగళవారం కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వరంగల్‌లోని స్వగృహంలో మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు 1932, డిసెంబర్ 28న వరంగల్‌లో వేణుమాధవ్ జన్మించారు. 1947లో తన 16వ ఏటనే మిమిక్రీ కెరీర్‌ను ప్రారంభించిన ఆయన దేశవిదేశాల్లో తెలుగు, హిందీ, ఉర్దూ, తమిళ భాషల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చారు.

సినిమాలంటే ఆసక్తి చూపే వేణుమాధవ్.. సి.నాగయ్య, గుమ్మడి వెంకటేశ్వర్రావు, అక్కినేని నాగేశ్వరరావు తదితర ప్రముఖులతో సన్నిహితంగా ఉండేవారు. ప్రముఖ నిర్మాత బీ.ఎన్. రెడ్డి ప్రోత్సాహంతో కొన్ని సినిమాల్లో నటించారు. సుమారు 12 సినిమాల్లో ముఖ్యమైన పాత్రలు పోషించారు. భారత మాజీ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, వి.వి.గిరి, జైల్ సింగ్, ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, నీలం సంజీవరెడ్డి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వంటి ఎందరో ప్రముఖులు ఆయన ప్రదర్శనలు వీక్షించారు. ప్రసిద్ధులైన వ్యక్తులను, నాయకులను అనుకరించడంలో వేణుమాధవ్ దిట్ట. 2001లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసింది. 1978లో ఆంధ్రా యూనివర్సిటీ ఆయనకు కళాప్రపూర్ణ బిరుదు ఇచ్చింది. ఏయూ, కేయూ, ఇగ్నో నుంచి గౌరవ డాక్టరేట్లను అందుకున్నారు.

**ఐక్యరాజ్యసమితిలో ప్రదర్శన**

తెలుగు, హిందీ, ఉర్దూ, తమిళ భాషల్లో మిమిక్రీ చేయగల నేరెళ్ల.. మిమిక్రీ ప్రదర్శనల కోసమే ఎన్నో దేశాలు తిరిగారు. ఐక్యరాజ్యసమితిలో ప్రదర్శన ఇచ్చిన ఏకైక తెలుగు కళాకారుడాయన. వేణుమాధవ్ ప్రదర్శన ముగిసిన వెంటనే ఐక్యరాజ్యసమితిలో అప్పుడు ఆసీనులైన ప్రతి ఒక్కరూ లేచి కరతాళధ్వనులు చేశారంటే ఆయన ప్రతిభను అర్థం చేసుకోవచ్చు. అమెరికాలో ఓ సారి ప్రదర్శన ఇస్తున్నప్పుడు మిమిక్రీ ఎప్పుడు పుట్టిందని ఓ వ్యక్తి ప్రశ్నించగా.. మీ దేశం పుట్టకముందే పుట్టిందని సమాధానం ఇచ్చారు నేరెళ్ల. 10 కమాండ్‌మెంట్స్ అనే ఆంగ్ల చిత్రంలోని ఓ ఎపిసోడ్‌ను ఆయన ప్రదర్శించిన తీరు ఇప్పటికే ప్రత్యేకమే. ఇది నేరెళ్ల వేణుమాధవ్‌లోని అసమాన ప్రతిభకు నిదర్శనం.

**అనుకరించని గళం లేదు**

నేరెళ్ల స్వరంలో వినిపించని గళం లేదంటే అతిశయోక్తి కాదు. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెనడీ దగ్గరి నుంచి భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వరకు హాలీవుడ్, బాలీవుడ్, తెలుగు చిత్రాల్లోని హీరోలు, హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు ఇలా ఎంతోమంది గొంతుకలను ఆయన తన స్వరంతో పలికించారు. వేల ప్రదర్శనలు ఇచ్చి అందరితోనూ శభాష్ అనిపించుకున్నారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, అమితాబ్ బచ్చన్, రేలంగి, రమణారెడ్డి, సుభాష్ చంద్రబోస్, ఎంఎస్ సుబ్బలక్ష్మి, గౌతు లచ్చన్న, ఎంజీఆర్, కరుణానిధి వంటి ప్రముఖులను తన గొంతులో సాక్షాత్కరింపజేశారు. ముఖ్యంగా ఆయన అనేక చోట్ల ప్రదర్శించిన జాన్ ఎఫ్.కెనడీ-సర్వేపల్లి రాధాకృష్ణన్ మధ్య జరిగిన సంభాషణ చాలా ప్రాచుర్యం పొందింది.

తన అద్భుత ప్రతిభతో నేరెళ్ల వేణుమాధవ్ ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. ఆయన ప్రతిభకు మెచ్చి కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ శివదర్పణం సంపుటిని అంకితం ఇచ్చారు. ఐవీ చలపతిరావు, పురాణం సుబ్రమణ్య శర్మ ఆయన ప్రస్థానంపై పుస్తకాలు రాశారు. నేరెళ్ల ప్రతిభను గుర్తించిన అప్పటి సమైక్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు ఆయన్ని ఎమ్మెల్సీగా నామినేట్ చేయడం విశేషం. హన్మకొండలోని పబ్లిక్ గార్డెన్‌లోని ఆడిటోరియానికి నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంగా ప్రభుత్వం నామకరణం చేసింది.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

## ఉపఎన్నికలు రావని
# తెలిసే రాజీనామా చేశారు
### పీసీసీ చీఫ్ రఘువీరెడ్డి విమర్శ



అమరావతి బీజేపీ, వైకాపా కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారని ఏపీ పీసీసీ చీఫ్ రఘువీరెడ్డి విమర్శలు గుప్పించారు. ఉప ఎన్నికలు రావని తెలిసే వైసీపీ ఎంపీలు రాజీనామా చేశారని ఆరోపించారు.

కర్ణాటక ఎంపీల రాజీనామాలను వెంటనే ఆమోదించారని... నెలలు గడుస్తున్నా వైకాపా ఎంపీల రాజీనామాలు ఆమోదించడం లేదన్నారు.

ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు రెండు వందలకు పైగా సీట్లు ఖాయమని రఘువీరా ధీమా వ్యక్తం చేశారు.




# 25వేల ఎకరాల్లో సూక్ష్మ నీటి సేద్యానికి లక్ష్యం
### జిల్లా కలెక్టర్ డా. ఎం.జవహర్‌లాల్



విజయనగరం : జిల్లాలో 2018-19 ఆర్థిక సంవత్సరానికి సూక్ష్మ నీటి సేద్యానికి 25 వేల ఎకరాలకు లక్ష్యంగా నిర్దేశించుకోవాలని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ డా.ఎం.హరి జవహర్‌లాల్ పిలుపు నిచ్చారు. మంగళవారం ఎపిఎంఐపి జిల్లాలో ఏర్పాటుచేసుకున్న లక్ష్యాల సాధన గురించి జరిగిన సమీక్షా సమవేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. సూక్ష్మ సేద్యంపై మండలాల వారీగా పనిచేస్తున్న అధికారులు శ్రద్ధతో లక్ష్యాలు నెరవేర్చాలన్నారు. క్షేత్రాధికారులు నిరంతరం కృషి చేస్తే లక్ష్యాల సాధన సులబమవుతుందని అన్నారు. సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వం ఇప్పటికి మొత్తం నిధులలో 50 శాతం విడుదల చేసిందని, ప్రగతి కనబడుతున్నకొద్దీ మిగిలిన 50 శాతం నిధులు విడుదల చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పర్చుకున్న లక్ష్యాలను విశ్వసనీయతతో అధికారులు కృసి చేయాలన్నారు. సత్యమనేది



సూర్యుని వంటిదని అది శాశ్వతమని అధికారులు విశ్వసనీయతను కూడా ఆ స్థాయిలో నిరూపించుకోవాలన్నారు. ప్రతి మండలంలోను ఏ పంటకు అనుకూలమో ఆ పంటలు మాత్రమే ప్రోత్సహించాలన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సూక్ష్మ సేద్య ప్రణాళిక లక్ష్యాలకు మైక్రో ఇరిగేషన్ కంపెనీలు జైన్ కంపెనీ, నాగార్జున కంపెనీ, నేటాఫిన్ కంపెనీ, కొటారి కంపెనీ, ఫినోలెక్స్, అక్షయ కంపెనీలకు ఎంపిక చేసామన్నారు. ఉద్యాన పంటలైన మామిడి, కొబ్బరి, బొప్పాయి, అరటి, జామ, పామాయిల్ కూరగాయలు, పూలసాగుకు వ్యవసాయ పంటలైన మొక్కజొన్న, చెరకు పంటలకు మరియు పట్టు పరిశ్రమకు సంబంధించి మల్బరీ సాగునకు పరికరాలు ఏర్పర్చుకున్న లక్ష్యాలను 20 వేల ఎకరాలకు బదులు 25 వేల ఎకరాలకు లక్ష్యాలు నిర్దేశించుకోవాలన్నారు.

ఈ సమీక్షాసమావేశంలో ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్-2 కె.సుబ్బారావు, ఎపిఎంఐపి పథక సంచాలకులు బి.పాండు రంగ, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు పిఎన్‌వి లక్ష్మీనారాయణ, విజయనగరం, బొబ్బిలి ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు లక్ష్మీ, శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు అప్పలస్వామి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గౌరీ లంకేశ్ హత్య కేసు
# హైకోర్టు సీరియస్
### 10 రోజుల్లో పూర్తి నివేదిక సమర్పించాలి

బెంగళూరు: సంచలన సృష్టించిన జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య కేసులో కర్ణాటక హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. నిందితులను పోలీసులు హింసిస్తున్నారంటూ హైకోర్టులో దాఖలైన ఓ పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై తక్షణమే నివేదిక సమర్పించాల్సిందిగా దిగువ న్యాయస్థానాల మెజిస్ట్రేట్‌లను ఆదేశించింది. ఈ ఆరోపణలను మేం తీవ్రంగా పరిగణిస్తున్నాం. 10 రోజుల్లో ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక సమర్పించాలి అని అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌లు(ఏసీఎంఎం) ఇద్దరికీ.. హైకోర్టు రిజిస్ట్రార్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. నిందితులలో ఒకడైన అమోల్ కాలే.. కస్టడీలో ఉండగా తనను పోలీసులు హింసించారని, మెజిస్ట్రేట్లు కూడా తన మొరను పట్టించుకోలేదని ఓ అఫిడవిట్ దాఖలు చేయించాడు.

నా క్లయింట్‌ని పోలీసులు విచక్షణ రహితంగా హింసించారు. మే 31వ తేదీన ఈ విషయాన్ని థర్డ్ ఏసీఎంఎంకు విన్నవించాం. కానీ, ఆయన పట్టించుకోలేదు. తిరిగి జూన్ 14వ తేదీన ఫస్ట్ ఏసీఎంఎంకు విన్నవించాం. ఆయన వైద్యపరీక్షలకు అనుమతించకుండా నివేదిక రూపొందించారు. ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు ఉల్లంఘించటమే అని నిందితుడి తరపు న్యాయవాది అఫిడవిట్‌లో పేర్కొన్నారు. పైగా కోర్టు ఆదేశాల ప్రకారం రహస్యంగా కాకుండా నిందితుల నుంచి బహిరంగంగా విచారణ చేపట్టి స్టేట్‌మెంట్లు నమోదు చేశారు. నష్టపరిహారంగా బాధితులకు రూ.25 లక్షలు చెల్లించేలా ఆదేశాలిప్పించండి అని న్యాయవాది విన్నవించాడు. వాదనలు విన్న న్యాయస్థానం మెజిస్ట్రేట్‌ల నుంచి వివరణ కోరుతూ ఆదేశాలు జారీ చేసింది. (ఏ కుక్క చచ్చిపోయినా.. ఆయనే బాధ్యుడా?)

మరోవైపు నిందితులను హింసించారన్న ఆరోపణల నేపథ్యంలో కర్ణాటక డీజీపీతోపాటు అధికారులకు హైకోర్టు జూన్12న నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 5, 2017న గౌరీలంకేశ్ హత్యకు గురికాగా, సిట్ దర్యాప్తు ఆధారంగా నిందితులు అమోల్ కాలే, సుజిత్ కుమార్, మనోహర్ ఎడవే, అమిత్ రామచంద్రలను పోలీసులు అరెస్ట్ చేశారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com